ప్రతి అక్షరం - ప్రజల కోసం
# రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
యాదాద్రి భువనగిరి
పేజీలు : 8
సంపుటి : 3
సంచిక : 57
శనివారం 27 జూలై 2024
చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్
HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD

## ఆరంభ సంబరం పారిస్ పరవశం

సెన్ నదిలో అలరించిన వేడుకలు
ఘనంగా ఒలింపిక్స్ ఆరంభం
తిలకించిన ప్రేక్షకులు 3,20,000
బోట్ల సంఖ్య 85పాల్గొన్న అథ్లెట్లు 6800
పరేడ్ దూరం 6 కి.మీ

7



# సైనికుల త్యాగాలను దేశం మరవదు

ఉగ్రవాదులను సమూలంగా పెకిలిస్తాం
కార్గిల్ అమరులకు ప్రధాని మోదీ నివాళి
పాక్‌కు పరోక్షంగా గట్టి హెచ్చరికలు
షింకున్ లా టన్నెల్ ప్రాజెక్ట్ నిర్మాణ పనులకు శ్రీకారం

లద్దాఖ్,జూలై26 : దేశం కోసం ప్రాణాలు పణంగా పెట్టి పోరాడిన సైనికుల త్యాగాలకు యావత్ భారతావని ఎప్పటికీ రుణపడి ఉంటుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. కార్గిల్ 25వ విజయ దివస్ ను పురస్కరించుకుని శుక్రవారం ఆయన లద్దాఖ్ వెళ్లారు. ద్రాస్‌లోని యుద్ధ స్మారకాన్ని సందర్శించి

మిగతా 2 లో





## రైతురుణమాఫీపై కొత్త తంటా

ఇచ్చిన డబ్బులు మిత్తిలకే పోతున్నాయి
ప్రభుత్వ తీరుపై మండిపడ్డ హరీష్ రావు

హైదరాబాద్,జూలై26 : రైతు రుణమాఫీ విషయంలో ఇచ్చిన మాట తప్పి.. ఆలస్యం చేయడం వల్ల రైతులకు కొత్త సమస్యలు మొదలయ్యాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు మండిపడ్డారు. ఏడు నెలల వడ్డీపై రైతులను బ్యాంకులు వేధిస్తున్నాయని చెప్పుకొచ్చారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంపై ఎమ్మెల్యే హరీష్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దీనిపై వెంటనే ప్రభుత్వం స్పందించిన రైతులకు అండగా నిలబడాలని మాజీ మంత్రి డిమాండ్ చేశారు. ఎక్స్ వేదికగా హరీష్‌రావు

మిగతా 2 లో

తెలంగాణలో పంచాయతీ ఎన్నికలకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. పార్లమెంట్ ఎన్నికలు ముగియడం, బడ్జెట్ సమావేశాలు కూడా ముగింపునకు రానుండడంతో ఒకటి రెండు నెలల్లో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని భావిస్తోంది. దీనికితోడు వాతావరణం కూడా ఇప్పుడు కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉంది. దీంతో ప్రజల్లో సానుకూలత ఉన్నప్పుడే ఎన్నికల్లో లబ్ది పొందాలన్న ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలో వచ్చే నెలలో అంటే ..మరి కొద్దిరోజుల్లోనే నగారా మోగనుందని తెలుస్తోంది.



# స్థానిక ఎన్నికల కసరత్తు

త్వరగా పూర్తి చేసేలా కార్యాచరణకు సిద్ధం
స్థానిక ఎన్నికలపై అధికారులతో సీఎం రేవంత్ సమీక్ష
త్వరలోనే వివరాలు వెల్లడించనున్న ప్రభుత్వం

హైదరాబాద్,జూలై26 : త్వరలోనే ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసి, ఆగస్టు నెల చివరి వరకు పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. అయితే ఐదేండ్ల క్రితం ఎన్నికల్లో కేటాయించిన రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు నిర్వహించాలని

మిగతా 2 లో

## ధరణి సమస్యలపై లోతుగా అధ్యయనం

భవిష్యత్‌లో సమస్యలు తలెత్తకుండా నిర్ణయం
ప్రజాభిప్రాయంతో పాటు...అఖిలపక్షంలో చర్చ
అధికారులతో సిఎం రేవంత్ రెడ్డి సమీక్ష

2

## తెలంగాణ యువతకు అండగా ప్రభుత్వం

ప్రభుత్వ ఖాళీల భర్తీకి తోణ చర్యలు
ఫైర్‌మెన్ పాసింగ్ ఔట్ పరేడ్‌లో సిఎం రేవంత్

.. వివరాలు 2లో



## పంపులు మీరు ఆన్ చేస్తారా.. మమ్ములను చేయమంటారా?

అసెంబ్లీ ముగిసేలోగా కాళేశ్వరం పంపులు ఆన్ చేయండి
లేకుంటే రైతులతో వచ్చి మేమే ఆన్ చేస్తాం
కెసిఆర్‌ను బద్నాం చేసేందుకే కాంగ్రెస్ డ్రామాలు
రోజుకు 2 టిఎంసిలు ఎత్తి పోసే అవకాశం
ప్రాజెక్టులను నీటితో నింపితే కరువుండదు
కాళేశ్వరంపై సర్కార్‌కు కేటీఆర్ అల్టిమేటమ్
బీఆర్ఎస్ బృందంతో కలసి పంపుహౌజుల పరిశీలన

హైదరాబాద్, జూలై 26 : వచ్చే నెల 2వ తేదీలోపు కాళేశ్వరం పరిధిలోని జలాశయాల్లో నీటిని నింపాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే 50 వేల మంది రైతులతో వచ్చి తామే పంప్‌హౌస్‌లు ఆన్ చేస్తామని హెచ్చరించారు. తెలంగాణ బీడు భూములను నీళ్లు అందిస్తామని

మిగతా 2 లో



## కవిత జ్యుడిషియల్ కస్టడీ 31 వరకు పొడిగింపు

న్యూఢిల్లీ,జూలై 26 : ఢిల్లీ లిక్కర్ స్కాంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఎమ్మెల్సీ కవిత జ్యుడీషియల్ కస్టడీని పొడిగిస్తూ ఢిల్లీలోని రూస్ అవెన్యూ కోర్టు మరోసారి ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా వారు దాఖలు చేసిన మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వీరి రిమాండ్‌ను ఈ నెల 31 వరకు

మిగతా 2 లో

## జంతర్ మంతర్‌కు రండి!

తెలంగాణకు కేంద్రం నిధులిచ్చినట్లు తేలితే ముక్కు నేలకు రాయాలి
రేవంత్, కేటీఆర్‌కు రఘునందన్ సవాల్
కేంద్ర పన్నుల్లో వాటా, గ్రాంట్లు కలిపి 50 వేల కోట్లు.. కేంద్రం ఇచ్చేవి కావా?



న్యూఢిల్లీ, జూలై 26 : తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం నిధులివ్వలేదంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత కేటీఆర్ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్దకు వస్తే కేంద్రం నిధులు ఇచ్చినట్లు తాము



## సైనికుల త్యాగం చిరస్మరణీయం

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ, జూలై 26 : కార్గిల్ యుద్ధాన్ని భారత్ గెలిచి పాతికేళ్లు అవుతోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. యుద్ధంలో మన సైనికులు చేసిన త్యాగం చిరస్మరణీయమని ఆయన ఒక ప్రకటనలో కొనియాడారు. దేశ రక్షణ

మిగతా 2 లో

## 'ఎల్ఆర్ఎస్' పరిశీలనకు జిల్లాకో బృందం!

మొత్తం 33 బృందాల ఏర్పాటు
కొత్త దరఖాస్తులకు చాన్స్?
దరఖాస్తుల పరిశీలనకు 33 బృందాలు
అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలు
25.29 లక్షల దరఖాస్తుల పెండింగ్



హైదరాబాద్, జూలై 26 : లే-అవుట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) పెండింగ్ దరఖాస్తులకు త్వరలోనే మోక్షం లభించనుంది. దరఖాస్తుల పరిష్కారానికి జిల్లాకో బృందాన్ని ప్రత్యేకంగా నియమించనుంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 33 బృందాలు ఎల్ఆర్ఎస్ పెండింగ్

మిగతా 2 లో

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శనివారం
27 జూలై
2024





# సైనికుల త్యాగాలను దేశం మరవదు

అమర జవాన్లకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాకిస్థాన్‌పై విరుచుకు పడ్డారు. ఉగ్రవాదాన్ని సమూలంగా పెకిలిస్తామని దాయాది దేశాన్ని మరోసారి గట్టిగా హెచ్చరించారు. గతంలో పాకిస్థాన్ పాల్పడిన వికృత ప్రయత్నాలు విఫలమయ్యాయి. అయినా, చరిత్ర నుంచి ఆ దేశం ఎలాంటి గుణ-పాఠాలు నేర్చుకోలేదు సరికదా.. ఉగ్రవాదం, ప్రాక్సీ వార్‌తో ఇంకా మనపై కవ్వింపు చర్యలకు పాల్పడుతూనే ఉంది. ఈ రోజు నేను మాట్లాడే మాటలు.. ఉగ్రవాదులను తయారుచేస్తున్న వారికి నేరుగా వినబడతాయి. ముష్కరులను పెంచి పోషిస్తున్న వారికి నేను చెప్పేది ఒక్కటే.. వారి దుర్మార్గపు కుట్రలు ఎన్నటికీ ఫలించవు. మా దళాలు ఉగ్రవాదాన్ని నలిపివేసి.. శత్రువులకు తగిన జవాబిస్తాయి అని మోదీ పాక్‌ను హెచ్చరించారు. కార్గిల్ యుద్దానికి లద్దాఖ్ సాక్షిగా నిలుస్తుంది. అమరుల త్యాగాలకు గుర్తుగా విజయ్ దివస్ జరుపుకుంటున్నాం. మన బలానికి, సహనానికి, వాస్తవాలకు ఈ విజయగాథ నిదర్శనం. దేశం కోసం ప్రాణాలు పణంగా పెట్టిన సైనికులు చిరకాలం గుర్తుండిపోతారు. కార్గిల్ యుద్ధ సమయంలో సామాన్యుడిగా సైనికుల మధ్య ఉండే అదృష్టం నాకు దక్కింది. దేశం కోసం వారు చేసిన పోరాటం నా మదిలో నిలిచిపోయింది. లద్దాఖ్, జమ్మూకశ్మీర్ అభివృద్ధి కోసం ఎలాంటి సవాళ్లనైనా భారత్ అధిగమిస్తుంది. మరికొద్ది రోజుల్లో ఆర్టికల్ 370ని రద్దు చేసి ఐదేళ్లు పూర్తవుతాయి. ఇప్పుడు జమ్మూకశ్మీర్ ప్రజలు సరికొత్త భవిష్యత్తు కోసం ఎదురుచూస్తున్నారు. పెద్ద కలల గురించి మాట్లాడుకుంటున్నారు. ప్రస్తుతం కశ్మీర్ ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలకు నిలయంగా ఉంది. ఈ భూలోక స్వర్గం శాంతి, సౌభ్రాతృత్వం వైపు వేగంగా పరిగెడుతోందని మోదీ తెలిపారు. అంతకుముందు, యుద్ధ స్మారకం వద్ద కార్గిల్ అమరవీరులకు ప్రధాని నివాళులర్పించారు. వీర జవాన్ల కుటుంబసభ్యులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా షింకున్ లా టన్నెల్ ప్రాజెక్ట్ నిర్మాణపనులను ప్రధాని మోదీ ప్రారంభించారు. టన్నెల్ నిర్మాణ ప్రాంతం వద్ద వర్చువల్‌గా తొలి బ్లాస్ట్ చేశారు. 4.1 కిలోమీటర్ల పొడవైన ఈ ట్విన్ ట్యూబ్ టన్నెల్‌ను 15,800 అడుగుల ఎత్తులో నిర్మించనున్నారు. అత్యవసర పరిస్థితుల్లో సాయుధ దళాలను వేగంగా తరలించేందుకు, సైనిక సామగ్రిని చేరవేసేందుకు ఈ సొరంగం సమర్థంగా ఉపయోగపడనుంది. దీని నిర్మాణం పూర్తయితే ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన సొరంగంగా గుర్తింపు సాధించనుంది.పొరుగు దేశం పాకిస్థాన్‌కు ప్రధాని మోదీ వార్నింగ్ ఇచ్చారు. 25వ కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా ద్రాస్ సెక్టార్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పాకిస్థాన్ నేరాలకు పాల్పడి గతంలో విఫలం అయ్యిందని, కానీ ఆ చరిత్ర నుంచి ఆ దేశం ఏమీ నేర్చుకోలేదని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఉగ్రవాదం, ప్రచ్ఛన్న యుద్ధంతోనే ఆ దేశం జీవనం చేస్తోందని విమర్శించారు. తాను మాట్లాడే ప్రదేశం నుంచి ఉగ్రదాడులకు పాల్పడుతున్న ముఠా నేతలు తన స్వరాన్ని నేరుగా వింటారని, ఉగ్రవాదానికి ఊతం ఇస్తున్న దేశాలకు ఓ విషయాన్ని చెప్పదలుచుకున్నానని, ఆ దేశ కుంచిత ఆలోచనలు ఎన్నటికీ విజయవంతం కావు అని ప్రధాని తెలిపారు. పూర్తి స్థాయి దళాలతో ఉగ్రవాదుల్ని మా సైనికులు అణిచివేస్తారని, శత్రువుకు బలమైన సమాధానం ఇస్తామని ప్రధాని మోదీ పేర్కొన్నారు. లడాఖ్ అయినా, జమ్మూకశ్మీర్ అయినా, అభివృద్ధికి అడ్డు వచ్చే ఎటువంటి సవాల్‌ను అయినా ఇండియా ఓడిస్తుందని మోదీ అన్నారు. ఆర్టికల్ 370ని రద్దు చేసి ఆగస్టు 5వ తేదీ నాటికి అయిదేళ్లు అవుతుందని, జమ్మూకశ్మీర్ ప్రజలు కొత్త భవిష్యత్తు, కొత్త కలల గురించి మాట్లాడుకుం టున్నారని తెలిపారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి, పర్యాటక రంగం.. లడాఖ్, జేకేలో వేగంగా వృద్ధి చెందుతోందన్నారు. కశ్మీర్‌లో కొన్ని దశాబ్దాల తర్వాత సినిమా హాల్‌ను ఓపెన్ చేసినట్లు చెప్పారు. 35 ఏళ్ల తర్వాత శ్రీనగర్‌లో తాజియా ఊరేగింపు జరిగిందన్నారు.



# పంపులు మీరు ఆన్ చేస్తారా.. మమ్ములను చేయమంటారా?

మొదటి పేజీ తరువాయి

స్పష్టం చేశారు. రాజకీయాల కోసం ప్రజలు, రైతులను ఇబ్బందులు పెట్టొద్దన్నారు. కేవలం రాజకీయ కక్షతో, కేసీఆర్‌ను బద్నాం చేయాలనే తలంపుతో పంపులను ఆన్ చేయడం లేదని విమర్శించారు. అసెంబ్లీ సమావేశాల్లోపు కాళేశ్వరం పంప్‌హౌస్‌లు ఆన్ చేయాలన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి కన్నెపల్లి లక్ష్మీ పంప్ హౌస్‌ను కేటీఆర్ పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ కల్పతరువన్నారు. కేసీఆర్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులం ప్రాజెక్టును పరిశీలించామని చెప్పారు. 'దేశ చరిత్రలో ఏ ప్రభుత్వం చేయనంత వేగంగా కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ నిర్మించారు. తెలంగాణలో కరువు అనే మాట వినపడొద్దని ఈ ప్రాజెక్టును నిర్మించారు. బీఆర్ఎస్ పాలనలో ఎప్పుడూ నీటి సమస్య లేదు. గతంలో నీటి సమస్య ఉండేదని రాష్ట్ర ప్రభుత్వం అసత్య ప్రచారం చేస్తున్నది. ఈ ప్రభుత్వం పంటల సాగు కోసం నీరు ఇచ్చే పరిస్థితి లేదు. శ్రీరాంసాగర్‌లో నీళ్లు లేవు, ఎల్ఎండీలో 5 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. మిడ్ మానేరులోనూ 5 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. శ్రీరాంసాగర్ సామర్థం 90 టీఎంసీలు అయితే ఇప్పుడు 25 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టుతో కరువు ప్రాంతాలకు సాగునీరు అందుతుంది. హైదరాబాద్‌కు కూడా మంచినీళ్లు అందించొచ్చు. 15 టీఎంసీలతో కొండ పోచమ్మ సాగర్ కట్టుకున్నం. 50 టీఎంసీలతో మల్లన్న సాగర్ కట్టుకున్నం. లక్ష్మీ పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోయవచ్చు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో మూడు రోజులకు ఒకసారి తాగునీరు అందిస్తున్నారు. పది లక్షల క్యూసెక్కుల నీరు వృధాగా కిందకు పోతున్నాయి. కాళేశ్వరం దగ్గర గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్నది. రిజర్వాయర్లు మాత్రం గొంతెండి ఎడారిలాగా మారాయని అన్నారు. ఇంత గొప్ప సిస్టమ్ రూపొందించడం మరొకరి వల్ల కాదు. 17 పంపులు రెడీగా ఉన్నాయి. రోజుకు 2 టీఎంసీలు ఎత్తిపోయొచ్చు. రాజకీయ పరమైన నిర్ణయం వల్లే నీటిని ఎత్తిపోయడంలేదు. ప్రభుత్వం తలచుకుంటే 18 లక్షల ఎకరాలకు నీళ్లివ్వొచ్చు. నీళ్లు సముద్రంలోకి వృధాగా పోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. బస్వాపూర్, కొండపోచమ్మ, రంగనాయకసాగర్, మల్లన్న సాగర్ రైతులు నీటికోసం ఎదురుచూస్తున్నారు. తుంగతుర్తి, కోదాడ, సూర్యాపేట వరకు రైతులు కాళేశ్వర జలాల కోసం ఎదురుచూస్తున్నరు. ఆరు నెలలు రాజకీయం చేద్దాం.. నాలుగున్నరేండ్లు ప్రజల కోసం కష్టపడి పనిచేద్దామని అన్నారు. నీటిని లిఫ్ట్ చేస్తే రెండు రోజుల్లో మిడ్ మానేరుకు చేరుకుంటాయి. కొండపోచమ్మ, మల్లన్నసాగర్, రంగనాయకసాగర్, అన్నపూర్ణ రిజర్వాయర్లు నింపొచ్చు. మిడ్‌మానేరు గత ఐదారేండ్లు నిండుగా ఉంది. ఇప్పుడు ఎడారిగా మారింది. పంప్‌హౌస్‌లపై ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలి. కేసీఆర్‌ను బద్నాం చేసేందుకు కాంగ్రెస్ చిల్లర ప్రయత్నాలు చేస్తున్నది. ప్రజలకు ఈ విషయాలన్నీ అర్థమైపోయినయి. రైతుల పక్షాన అసెంబ్లీలో చర్చకు డిమాండ్ చేస్తం. కాళేశ్వరంలో పరిధిలో రిజర్వాయర్లలో నీటిని నింపడానికి ప్రభుత్వానికి ఆగస్టు 2 వరకు గడువిస్తున్నాం. సర్కార్ స్పందించకపోతే 50 వేల రైతులతో తామే పంపులు ఆన్ చేస్తం. తెలంగాణ బీడు భూములకు నీళ్లు అందిస్తం. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని అసెంబ్లీలో నిలదీస్తం. రాజకీయాల కోసం ప్రజలు, రైతులను ఇబ్బందులు పెట్టొద్దు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అని ప్రపంచమంతా గుర్తించింది. ఎందరో మేధావులు కాళేశ్వరం గొప్పతనాన్ని ప్రశంసించారు. చిన్న సమస్య తలెత్తితే ప్రాజెక్టుపై విషప్రచారం చేస్తున్నారు. మహారాష్ట్రతో ఒప్పందం చేసుకుని అద్భుతమైన ప్రాజెక్టును నిర్మించాం. అన్నారం, సుందిళ్లపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసింది. గ్రౌడింగ్ అనేది నిరంతరం పక్రియ, 2020లోనూ చేశామని ఇంజినీర్లు చెప్పారు. రైతుల మీద కాంగ్రెస్ రాజకీయాలు బంద్ చేయాలి. కేసీఆర్ ఇంతగొప్ప ప్రాజెక్టును నిర్మిస్తే వాడుకునే తెలివి కాంగ్రెస్‌కు లేదు.' అని కేటీఆర్ విమర్శించారు. న్నెపల్లిలో నీటి లభ్యత ఎక్కువ అని కేసీఆర్ గుర్తించారని, అందుకే అక్కడ పంప్ హౌస్ కట్టారని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి అన్నారు. సమైక్య పాలకులు ప్రాణహిత కలిసిన తర్వాత గోదావరిపై ఎక్కడా ప్రాజెక్టు కట్టలేదని విమర్శించారు. మేడిగడ్డ బ్యారేజీలో చిన్న లోపం.. ప్రపంచంలో ఎక్కడైనా జరుగుతాయన్నారు. ఆ చిన్న లోపాన్ని అడ్డంపెట్టుకుని కాంగ్రెస్, బీజేపీ తప్పుడు ప్రచారం చేశాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. రెండున్నర వేల క్యూసెక్కుల నీళ్లు వస్తే ఒక మోటర్ ఆన్ చేయొచ్చని తెలిపారు. నీటిని ఎత్తిపోస్తే చివరి సూర్యాపేట, డోర్నకల్ వరకు నీళ్లు అందించవచ్చని చెప్పారు. కేసీఆర్‌ను బద్నాం చేసి బతకాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ఆలోచన అన్గి÷ర్ అయ్యారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి రైతుల నోట్లో మట్టి కొట్టారని విమర్శించారు. ఉద్దేశపూర్వకంగానే నీటి ఎత్తిపోతను ఆపారని ఆరోపించారు. ఎల్ఎండీ, మిడ్ మానేరులో టీఎంసీలకు పైగా నీళ్లుండేవని, ఇప్పుడు అసలు నీటి జాడే లేదని మాజీ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కాళేశ్వరం నుంచి ప్రభుత్వం వెంటనే నీటిని ఎత్తిపోయాలని డిమాండ్ చేశారు. కెటిఆర్ వెంట సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డి, సత్యవతి రాథోడ్, వేముల ప్రశాంత్ రెడ్డి, జగదీశ్ రెడ్డి, మల్లారెడ్డి, కౌశిక్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# రైతురుణమాఫీపై కొత్త తంటా

మొదటి పేజీ తరువాయి

స్పందిస్తూ.. డిసెంబర్ 9న రైతు రుణమాఫీ చేస్తామన్న మాట తప్పి, 7 నెలల తర్వాత ఆ పక్రియను ప్రారంభించడం వల్ల రైతులకు కొత్త సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. ముందుగా ఏడు నెలల వడ్డీ చెల్లించాకే, రుణ మాఫీ చేస్తామని బ్యాంకర్లు వేధిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు.

ప్రభుత్వం చెప్పిన రుణమాఫీ దేవుడెరుగు, వడ్డీ చెల్లించేందుకు కొత్తగా అప్పులు చేయాల్సి వస్తుందని బాధపడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి డిసెంబర్ నుంచి జూలై దాకా వడ్డీని తామే భరిస్తామని, రైతుల నుంచి వసూలు చేయవద్దని స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గం శివంపేట్ మండలానికి చెందిన ఒక రైతు క్రాప్ లోన్‌ను, రూ.9000 మిత్తి కట్టించుకున్నాకే క్లోజ్ చేశారన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలానికి చెందిన రైతులకూ ఇదే పరిస్థితి ఎదురైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. తనకు రైతులు పంపిన విజ్ఞప్తులను ప్రభుత్వ పరిశీలనకు పంపుతున్నానని... పరిష్కరించాలని కోరుతున్నట్లు హరీశ్‌రావు ట్వీట్ చేశారు.

లక్ష రూపాయల రుణాలు మాఫీ అని ప్రకటించినప్పటికీ కొన్ని చోట్ల మాత్రం మొత్తం రుణాలు మాఫీ కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఏర్పాడ్డాయి. ఓ రైతులు లక్ష రూపాయల రుణం ఉండగా కేవలం మూడు వేలు మాత్రమే మాఫీ అయినట్లు తెలుస్తోంది. మరికొన్ని చోట్ల బ్యాంకులు వడ్డీలు వసూలు చేస్తున్నట్లు సమాచారం. దీంతో రైతులు ఏం చేయాలో తెలియక అయోమయంలో ఉండిపోయే పరిస్థితి ఏర్పడింది. కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ విధానం మరోమారు బయటపడిందని హరీశ్‌రావు విమర్శించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పూర్తిగా విఫలమైందని, ప్రైవేటు బీమా కంపెనీలకు లబ్ది చేకూర్చడానికే దాన్ని వాడుకుంటున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ జైరామ్ రమేశ్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు.రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అదే పథకానికి రెడ్ కార్పెట్ పరిచి అమలు చేసేందుకు సిద్ధంగా ఉందని ఆక్షేపించారు. అదానీకి భాజపా దోచిపెడుతుందని రాహుల్ గాంధీ అంటే.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అదానీతో రూ.వేల కోట్ల ఒప్పందాలు కుదుర్చుకుంటోందన్నారు. దిల్లీ కాంగ్రెస్ చెబుతున్నది నిజమా? తెలంగాణ కాంగ్రెస్ చెబుతున్నది నిజమా?..ఏది వాస్తవమో స్పష్టత ఇవ్వాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# కవిత జ్యుడీషియల్ కస్టడీ 31 వరకు పొడిగింపు

మొదటి పేజీ తరువాయి

పొడిగించింది. మరోవైపు సీబీఐ దాఖలు చేసిన కేసులో వాదనలు విన్న న్యాయమూర్తి కావేరీ బవేజా గురువారం రాత్రి రిమాండ్‌ను ఆగస్టు 8 వరకు పొడిగించారు. తీహార్ జైలు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జైలు అధికారులు నిందితులను కోర్టు ముందు హాజరుపరిచారు.

కవితపై చార్జిషీటులో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. మద్యం పాలసీ రూపకల్పనలో ప్రధాన సూత్రధారి కవిత అని సీబీఐ పేర్కొంది. మద్యం వ్యాపారులకు అనుకూలంగా మద్యం పాలసీ తయారీ? అందుకు సౌత్ గ్రూప్ నుంచి పెద్ద ఎత్తున విరాళాలు అందాయి. రూ. 100 కోట్ల ముడుపులు సేకరించి విజయ్ నాయర్ ద్వారా ఆమ్ ఆద్మీ పార్టీలో చేరడంలో కవిత సూత్రధారి అని సీబీఐ చెబుతోంది. కవిత కోసం బుచ్చిబాబు, అభిషేక్ బోయిన్ పల్లి, అరుణ్ పి÷-ల్లై, అశోక్ కౌశిక్ పనిచేశారని సీబీఐ చెబుతోంది. మద్యం వ్యాపారంలో భాగస్వామ్యం కోసం కవితకు మాగుంట రాఘవ, వెనక శరత్‌రెడ్డి డబ్బులు సమకూర్చినట్లు సమాచారం. మద్యం వ్యాపారం పేరుతో వసూలు చేసిన సొమ్మును హవాలా ద్వారా గోవా ఎన్నికల్లో ఖర్చు చేసినట్లు సీబీఐ ఇప్పటికే వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇక లిక్కర్ పాలసీ సీబీఐ కేసులో కవితను దర్యాప్తు సంస్థ ఏప్రిల్ 11న అరెస్టు చేసింది. మూడు రోజుల సీబీఐ కస్టడీ అనంతరం ఏప్రిల్ 15 నుంచి జుడీషియల్ కస్టడీలో భాగంగా కవిత తీహార్ జైలులో ఉన్నారు.కవిత ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో తీహార్ జైలులో ఉన్నారు. జూలై 1న ఈడీ, సీబీఐ కేసుల్లో కవిత బెయిల్ పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు తిరస్కరించింది. మద్యం కుంభకోణం కేసులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితలకు ఢిల్లీ రూస్ అవెన్యూ కోర్టు మరోసారి జ్యుడీషియల్ కస్టడీని పొడిగించింది.

# సైనికుల త్యాగం చిరస్మరణీయం: కిషన్‌రెడ్డి

మొదటి పేజీ తరువాయి

వ్యవస్థకు పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.6,21,940.85 కోట్లను రక్షణ శాఖకు కేటాయించామని తెలిపారు. 'వన్ ర్యాంక్-వన్ పెన్షన్' పథకాన్ని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. 2014లో సైనికుల పెన్షన్ కోసం రూ.40 వేల కోట్లు కేటాయిస్తే, ఈసారి బడ్జెట్ లో రూ. 1.41 లక్షల కోట్లు కేటాయించామని వివరించారు. పదవీ విరమణ చేసిన సైనికుల కుటుంబాలకు వైద్య సదుపాయాల కోసం రూ. 6,968 కోట్లను కేటాయించామని తెలిపారు.

# 'ఎల్ఆర్ఎస్' పరిశీలనకు జిల్లాకో బృందం!

మొదటి పేజీ తరువాయి

దరఖాస్తులను పరిశీలించనున్నాయి. ఎల్ఆర్ఎస్ కింద ఇప్పటికే లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా.. వాటి పరిష్కారంతో పాటు కొత్తగా దరఖాస్తు చేసుకునే అవకాశం కూడా కల్పించేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే రెవెన్యూశాఖ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి, సీసీఎల్ఏ నవీన్ మిత్తల్ ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. శుక్రవారం డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటితో కలిసి ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. లే-అవుట్ అనుమతుల కోసం ప్రజలు చేసుకున్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని భట్టి సూచించారు. ఇందుకోసం 33 జిల్లాల్లో ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేయాలని, సిబ్బంది కొరత ఉంటే ఇతర శాఖల నుంచి డిప్యుటేషన్‌పై తీసుకోవాలని చెప్పారు. ఎల్ఆర్ఎస్, బీఆర్ఎస్ కింద 25.29 లక్షల దరఖాస్తులు ఉన్నాయి.

వీటి క్రమబద్ధీకరణతో భారీగా ఆదాయం వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నారు. అపరిష్కృత దరఖాస్తుల్లో గ్రామ పంచాయతీల పరిధిలో 10,83,394, మునిసిపాలిటీల్లో 10,60,013, నగర పాలక సంస్థల పరిధిలో 4,16,155 దరఖాస్తులు ఉన్నాయి. స్థలానికి రూ.1,000, లే అవుట్లకు రూ.10,000 చొప్పున ప్రభుత్వం రుసుము వసూలు చేసింది. దీంతో దరఖాస్తు ఫీజు కిందే రూ.257.47 కోట్ల ఆదాయం వచ్చింది. వాటిని పరిష్కరిస్తే ఖజనాకు మరింత ఆదాయం సమకూరుతుందని రేవంత్ సర్కారు భావిస్తోంది.

# జంతర్ మంతర్‌కు రండి!

మొదటి పేజీ తరువాయి

నిరూపిస్తామని, వారిద్దరూ ముక్కు నేలకు రాస్తారా? అని సవాల్ విసిరారు. ఈ మేరకు రఘునందన్‌రావు శుక్రవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. కేసీఆర్, రేవంత్‌రెడ్డిల పాలనలో తేడా ఏమీ లేదని, కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కేసీఆర్ రూ.20 కోట్లకు కొంటే.. తాము బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను రూ.5 కోట్లకే కొంటున్నామని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మీడియాతో చిట్‌చాట్‌లో చెప్పారని గుర్తు చేశారు.

మూసీ ప్రక్షాళనకు కేంద్రం నిధులివ్వలేదని సీఎం చెబుతున్నారని, కానీ. డీపీఆర్ ఇవ్వకుండానే నిధులెలా వస్తాయని ప్రశ్నించారు. తెలంగాణ బడ్జెట్‌లోనే కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా రూ.26వేల కోట్లు, గ్రాంట్ల రూపంలో మరో రూ.21వేల కోట్లు చూపించారని గుర్తుచేశారు. ఈ రెండూ కలిపి సుమారు 50వేల కోట్లు అవుతాయని, ఇవి కేంద్రం నుంచి వచ్చేవి కావా? అని ప్రశ్నించారు. రాష్ట్ర బడ్జెట్‌లో మైనారిటీల పండుగలకు రూ.33 కోట్లు కేటాయించిన విషయాన్ని రఘునందన్‌రావు గుర్తు చేస్తూ.. రాష్ట్రంలో హిందువులు లేరా? హిందూ పండుగలు లేవా? అని ప్రశ్నించారు. కొడంగల్‌కు డిగ్రీ కాలేజీ, నర్సింగ్ కాలేజీలు వచ్చాయని, రాష్ట్రంలో మిగిలిన 118 నియోజకవర్గాలు కనిపించలేదా?అని నిలదీశారు. తెలంగాణ అభివృద్ధికి ప్రధాని నరేంద్రమోదీ కట్టుబడి ఉన్నారని తెలిపారు.

# స్థానిక ఎన్నికల కసరత్తు



మొదటి పేజీ తరువాయి

సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించినట్లు సమాచారం. శుక్రవారం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఇప్పటికే సర్పంచుల పదవీకాలం ముగిసి ఆరు నెలలు కావస్తున్నం దున రిజర్వేషన్లలో ఎలాంటి మార్పు లేకుండా గత రిజర్వేషన్లలే కొనసాగించాలని, ఆగస్టు నెలలో ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ సమావేశంలో పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్కతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపుపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి వారం రోజుల క్రితం ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ల అమలు, రాబోయే ఎన్నికల్లో వాటి పెంపునకు సంబంధించిన అంశాలను వెల్లడించాలని అధికారులకు సీఎం సూచించారు. గత పంచాయతీ ఎన్నికల్లో అనుసరించిన విధానం, రానున్న పంచాయతీ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న తీరును రేవంత్‌కు అధికారులు వివరించారు. ఇప్పటికే కులగణనకు ఆమోదం తెలిపినందున, దాని ఆధారంగా పంచాయతీ ఎన్నికలకు వెళితే ఎలా ఉంటుందని, అందుకు ఎంత సమయం తీసుకుంటారని అధికారులను సీఎం ప్రశ్నించారు. కర్ణాటకలో 2015లో, బీహార్‌లో 2023లో కుల గణన చేశారని, ఆంధ్రప్రదేశ్‌లో కులగణన చేసినా వివరాలు ఇంకా బయట పెట్టలేదని అధికారులు వివరించారు. 2011లో కేంద్ర ప్రభుత్వం అనుసరించిన కులగణన ఫార్మాట్ 53 కాలమ్స్‌తో ఉన్నదని, దానికి మరో మూడు కాలమ్స్ జోడించి కులగణన చేపడితే కనీసం అయిదున్నర నెలల సమయం పడుతుందని తెలిపారు. బీసీ రిజర్వేషన్ల పెంపుతో పాటు స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు ఆగిపోకుండా త్వరగా ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన ప్రణాళిక సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. ఈ సమావేశంలో రిజర్వేషన్ల పెంపు అంశంపై సుదీర్ఘ చర్చ సాగింది. మొత్తానికి ఈ పరిణామాల నేపథ్యంలో గత ఎన్నికల్లో కేటాయించిన రిజర్వేషన్ల ప్రకారమే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం.

**ధరణి సమస్యలపై లోతుగా అధ్యయనం**

**భవిష్యత్‌లో సమస్యలు తలెత్తకుండా నిర్ణయం**

**ప్రజాభిప్రాయంతో పాటు...అఖిలపక్షంలో చర్చ**

**అసెంబ్లీలోనూ చర్చించిన తరవాత మార్పులు**

**అధికారులతో సిఎం రేవంత్ రెడ్డి సమీక్ష**

హైదరాబాద్,జూలై 26 : ధరణి సమస్యల పరిష్కారానికి మరింత లోతుగా అధ్యయనం చేయాలని అధికారులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ధరణి సమస్యల పరిష్కారానికి మరింత లోతుగా అధ్యయనం చేయడం ద్వారా శాశ్వత పరిష్కారం దక్కేలా చూడాలని అధికారులకు సూచించారు. ధరణి సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని, సవరణలపై కొత్త సమస్యలు తలెత్త కుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సవరణలపై ప్రజాభిప్రాయం పరిగణనలోకి తీసుకోవాలని, అఖిలపక్ష సమావేశం నిర్వహించి అభిప్రాయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రజల అభిప్రాయాలు, సూచనల ఆధారంగా సమగ్ర చట్టం రూపొందించాలని, అవసరమైతే అసెంబ్లీలోనూ చర్చ పెడదామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ధరణిపై సచివాలయంలో సిఎం రేవంత్ సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ధరణి సమస్యల పరిష్కారం దిశగా అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సమీక్షలో పలువురు మంత్రులు, అధికారులు పాల్గొన్నారు.ధరణిలో సమస్యలు, మార్పులు-చేర్పులు ఇతర అంశాలపై చర్చించిన సీఎం కీలక వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో ధరణి పోర్టల్ విషయంలో రైతులు నానా ఇబ్బందులు పడిన విషయం తెలిసిందే. అయితే కాంగ్రెస్ ప్రభుత్వంలో అలాంటివేమి ఉండకూడదని భావించిన రేవంత్.. శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపడుతున్నారు. సవరణలపై ప్రజాభిప్రాయం పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. అఖిలపక్ష సమావేశం నిర్వహించి అభిప్రాయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి వివరించారు. ప్రజల అభిప్రాయాలు, సూచనల ఆధారంగా సమగ్ర చట్టం రూపొందించాలని సూచించారు. అవసరమైతే అసెంబ్లీలోనూ చర్చ పెడదామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ధరణిపై కీలకంగా చర్చించిన ఈ సమావేశంలో మంత్రి పొంగులేటి, ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు, జానారెడ్డి, ధరణి కమిటీ సభ్యులు కోదండ రెడ్డి, సునీల్, సీఎస్ శాంతి కుమారి పాల్గొన్నారు.

**తెలంగాణ యువతకు అండగా ప్రభుత్వం**

**ప్రభుత్వ ఖాళీల భర్తీకి తోణ చర్యలు**

**ఫైర్‌మెన్ పాసింగ్ ఔట్ పరేడ్‌లో సిఎం రేవంత్**

హైదరాబాద్,జూలై 26 : ఏ ఆకాంక్షతో యువత తెలంగాణ పోరాటంలో పాల్గొన్నారో.. ఆ ఆకాంక్షను గత ప్రభుత్వం నెరవేర్చలేదని సిఎం రేవంత్ అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నిరుద్యోగుల ఆకాంక్షలు నెరవేర్చేందుకు ఉద్యోగ నియామక పత్రాలను పంపిణీ చేశామన్నారు. తెలంగాణ విపత్తు నిర్వహణ, అగ్నిమాపక శాఖలో భర్తీ అయిన 483 మంది ఫైర్‌మెన్ అభ్యర్థులు శిక్షణ పూర్తి చేసుకున్నారు. తెలంగాణ విపత్తు నిర్వహణ, అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో వీరంతా నాలుగు నెలలుగా తీసుకుంటున్న శిక్షణ పూర్తయింది. ఈ క్రమంలోనే అభ్యర్థుల పాసింగ్ అవుట్ పరేడ్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజయ్యారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..ఫైర్ మెన్ శిక్షణ పూర్తి చేసుకున్న యువకులకు శుభాకాంక్షలు తెలిపారు. శిక్షణ పూర్తిచేసుకున్న మిమ్మల్ని చూసి మీ తల్లిదండ్రులు గుండెలనిండా సంతోషిస్తున్నారని అన్నారు. సమాజాన్ని కాపాడాలన్న ఉద్దేశంతో ముందుకు వచ్చిన మీ అందరినీ అభినందిస్తున్నానని రేవంత్ అన్నారు. తమ ప్రభుత్వం ప్రజల ఆలోచనలకు అనుగుణంగా ముందుకు వెళుతోందన్నారు. అందులో భాగంగానే విద్య, వ్యవసాయానికి బడ్జెట్ లో అత్యధిక నిధులు కేటాయించామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఆలోచనలకు అనుగుణంగా విద్య, వైద్యానికి బడ్జెట్ లో ప్రాధాన్యతనిచ్చామని పేర్కొన్నారు.ప్రభుత్వ ఉద్యోగులకు మొదటి తారీఖు జీతం అందించి ఉద్యోగులకు ప్రభుత్వం పై విశ్వాసం కల్పించామని రేవంత్ తెలిపారు. 90 రోజుల్లో మరో 30 వేల ఉద్యోగాలను భర్తీ చేయబోతున్నామన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది తిరగకముందే 60 వేలకు పైగా ఉద్యోగాలు అందించి నిరుద్యోగుల్లో విశ్వాసం కల్పిస్తున్నామ న్నారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తూ ముందుకెళతామన్నారు. నిరుద్యోగులకు, విద్యార్థులకు ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ఒక సూచన చేశారు. వారికి ఏవైనా సమస్యలు ఉంటే మంత్రులు, ఎమ్మెల్యేలకు విన్నవించాలని రేవంత్ తెలిపారు. మీ సమస్యలను పరిష్కరించేందుకు మీ రేవంతన్నగా మీకు ఎప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. రంగారెడ్డి జిల్లా వట్టినాగులపల్లిలో తెలంగాణ ఫైర్ సర్వీసెస్ అండ్ సివిల్ డిఫెన్స్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ లో ఫైర్‌మెన్ పాసింగ్ అవుట్ పరేడ్ కు ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రి శ్రీధర్ బాబు,ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శనివారం 27 జూలై 2024



# బిజెపి గిరిజన మోర్చా ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి



భువనగిరి,జూలై26(రోమింగ్ న్యూస్) : బీజేపీ గిరిజన మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టరేట్ ముట్టడించారు. ఈ సందర్భంగా గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు అజ్మీర కిషన్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేవెళ్ల బహిరంగ సభలో గిరిజన డిక్లరేషన్ లో ఇచ్చిన హామీలను ఇస్తానని చెప్పి మోసపూరిత వాక్యాలు, వాగ్దానాలు ఇచ్చి మరచిపోయిండన్నారు. అసెంబ్లీ బడ్జెట్లో గిరిజనులకు అన్యాయం జరిగిందని, గిరిజనులకు 12% రిజర్వేషన్ ఎన్నికల హామీలు ఇచ్చి అమలు చేయలేదన్నారు. అనంతరం కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి భూక్య నరేష్ నాయక్, గిరిజన మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు నాయక్, ప్రధాన కార్యదర్శి ధరావత్ వెంకటేష్,జిల్లా ఉపాధ్యక్షుడు శంకర్ నాయక్, ఉపాధ్యక్షుడు అశోక్ నాయక్, ఉపాధ్యక్షుడు తార్య నాయక్,బిచ్చ నాయక్,బాలు నాయక్, యాదాద్రి మండల అధ్యక్షుడు శ్రీను నాయక్, బీజేవైఎం మండల,అధ్యక్షుడు మధు నాయక్ పాల్గొన్నారు.

# నిత్య అన్నదాన పథకానికి విరాళం



శ్రీశైలం ,జూలై 26 ( రోమింగ్ న్యూస్. ) శాశ్వత అన్నప్రసాద పథకానికి విరాళం రూ.1,00,116/-లను శ్రీ లింగాల విజయ కుమార్ రెడ్డి, పులివెందుల వారు అందజేశారు. ఈ మొత్తాన్ని సహాయ కార్యనిర్వహణాధికారి జి.స్వాములు, పర్యవేక్షకులు డి. స్వర్ణలతలకు అందజేయడం జరిగింది. వారికి శ్రీ స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదములు మరియు శేష వస్త్రములు అందజేయడమైనది.

# శ్రీ స్వామి అమ్మవార్లను దర్శించుకున్న డోన్ ఎమ్మెల్యే



శ్రీశైలం, జూలై 26 (రోమింగ్ న్యూస్) : శ్రీ స్వామి అమ్మవారిని డోన్ ఎమ్మెల్యే శ్రీ సూర్యప్రకాశ్ రెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ ఈవో పెద్దిరాజు రాజగోపురం వద్ద ఆలయ అధికారులు, అర్చక స్వాములతో కలిసి స్వాగతం పలికారు. అనంతరం శ్రీ స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. తదుపరి వేద ఆశీర్వచన మండపం నందు ఆశీర్వచనం గావించి శ్రీ స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదములు, శేష వస్త్రములు మరియు మెమొంటోను అందజేయడమైనది.

# రోడ్లపై గుంతలు పూడ్చిన పోలీసులు,లయన్స్ క్లబ్



కేసముద్రం, జూలై 26 (రోమింగ్ న్యూస్): కేసముద్రం పోలీస్ స్టేషన్ ప్రాంతం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు రోడ్లపై ఏర్పడిన గుంతలను లయన్స్ క్లబ్ సభ్యుడు దాసరి అశోక్ సహకారంతో ఎస్ఐ మురళీధర్ రాజ్ గుంతలను పూడ్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మురళీధర్ రాజ్ మాట్లాడుతూ 15 రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయని,వీటిని పూడ్చేందుకు సహకరించాలని కోరడంతో స్థానిక లయన్స్ క్లబ్ ముందుకు వచ్చినట్లు తెలిపారు.సుమారురూ.30వేల విలువైన మొరాన్ని తరలించి రోడ్డుపైనున్న గుంతలను పూడ్చినట్లు తెలిపారు.ప్రజల సౌకర్యార్థం అడిగిన వెంటనే స్పందించి రోడ్డు మరమ్మతుకు సహకరించిన లయన్స్ క్లబ్ కు ఎస్ఐ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ లు కృష్ణమూర్తి,సుధాకర్,క్లబ్ చార్టెడ్ ప్రెసిడెంట్ డాక్టర్ కె చంద్రశేఖర్,పాస్ట్ జడ్పీలు చందా గోపి,ఊకంటి యాకూబ్ రెడ్డి,యర్నం శ్రీరాములు, కోశాధికారి లక్కాకుల సత్యనారాయణ,సభ్యులు చింతా కర్ణాకర్,పరాంకుశం శ్రీహరి,కట్కూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మ దహనం..

**బీసీల ఆత్మ గౌరవం దెబ్బతీసిన కేంద్ర రాష్ట్ర బడ్జెట్...**

**బడ్జెట్ ను సవరించి బీసీలకు పేద విద్యార్థులకు న్యాయం చేయకపోతే మిలిటెంట్ ఉద్యమాలు చేస్తాం : అఖిలపక్షం**





భువనగిరి,జూలై26(రోమింగ్ న్యూస్)కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బడ్జెట్లో బీసీలకు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అగ్రవర్ణ పేద విద్యార్థులకు నిధులు కేటాయించకపోవడంపై
బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పల్లగొర్ల మోదీరాందేవ్, గుండెబోయిన శంకర్ ఆధ్వర్యంలో అఖిలపక్షం నాయకులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 60 శాతం ఉన్న బీసీలకు రాష్ట్ర బడ్జెట్లో 2% నిధులు కేటాయించడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలే ఊపిరి అని చెప్పి అధికారంలోకి వచ్చాక బడ్జెట్లో 15 శాతం నిధులు కేటాయిస్తామని చెప్పి ఓట్లు వేయించుకొని గెలిచాక బీసీలను విస్మరించడం అన్యాయమన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ సవరించి బీసీలకు అధిక సంఖ్యలో నిధులు కేటాయించి విద్యార్థులకు రావాల్సిన బడ్జెట్ను ఇవ్వాలన్నారు. 77 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో 85 కోట్లున్న బీసీలకు కేంద్ర ప్రభుత్వం 3300 కోట్లు కేటాయించడం సరికాదన్నారు. దోపిడి పీడన వివక్షకు గురవుతున్న జాతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాల మీద ఉందన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీలకు రాజకీయ విద్యా వైద్య రంగాలలో అవకాశాలు కల్పించాలన్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే బడ్జెట్ను సవరించి న్యాయం చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు కిరణ్ కుమార్, బట్టు రామచంద్రయ్య, బిఆర్ ఎస్ మండల అధ్యక్షులు జనగాం పాండు, కౌన్సిలర్ భగత్, సిరిపంగా సుభాష్, తుమ్మేటి మహేష్, నాకోటి నాగేష్, చిన్న, రమాదేవి, ఉషారాణి, భాస్కర్, వినయ్, సుమన్ పాల్గొన్నారు.

# అనర్హులకు డబల్ బెడ్రూమ్ ఇండ్లు ఇవ్వద్దు

**స్టేషన్ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి**



జనగామ, జూలై, 26 (రోమింగ్ న్యూస్) : గతంలో పేదరికంతో బాధపడుతూ, ఇండ్లు లేని అర్హులైన వారికి కాకుండా అనేకమంది అనర్హులకు ప్రభుత్వ ఇల్లు మంజూరు కావడం మనకు తెలిసిందే. ఈ విషయంలో పలు రాజకీయ పార్టీలు పోరాటాలు చేయడం, అయినప్పటికీ అర్హులకు న్యాయం జరగకపోవడం కూడా మనం చూస్తున్నాం. ఈ క్రమంలో అర్హులైన లబ్ధిదారులకే రెండు పడక గదుల ఇండ్లు మంజూరు చేయాలని స్టేషన్ఘన్పూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి అధికారులను ఆదేశించారు
శుక్రవారం జనగామ కలెక్టర్ కార్యాలయంలో రెండు పడక గదుల ఇండ్ల నిర్మాణాలపై జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అధ్యక్షతన సంబంధిత రెవెన్యూ, ఇంజనీరింగ్, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారులతో కలసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమీక్షిస్తూ పలు ఆదేశాలు జారీ చేశారు . ఈ సందర్భంగా శాసనసభ్యులు కడియం శ్రీహరి మాట్లాడుతూ తన నియోజక వర్గంలోని 5 మండలాలలో మంజూరైన 1145 ఇండ్లలో 615 టెండర్ దశలో ఉన్నాయని, పూర్తయిన ఇండ్లకు అర్హులైన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను త్వరితగతిన చేపట్టాలన్నారు. అనర్హులకు ఎట్టి పరిస్థితుల్లో ఏ మాత్రం ఆకాశం ఇవ్వకూడదని ఎలాంటి పైరవీలను ప్రోత్సహించకూడదని, ఈ ప్రక్రియ పారదర్శకంగా జరగాలని అధికారులను ఆయన ఆదేశించినట్లు తెలిసింది. ఈ సమీక్ష సమావేశం లో అదనపు కలెక్టర్ లు పింకేశ్ కుమార్, రోహిత్ సింగ్, జనగామ, స్టేషన్ ఘన్పూర్ ఆర్డీవోలు కొమరయ్య, వెంకన్న, గృహనిర్మాణ శాఖ నోడల్ అధికారి దామోదర్, టి.జి.డబ్ల్యు.ఐ.డి.సి. ఈఈ నరేందర్ రెడ్డి, డి.ఈ. కృష్ణ కుమార్, ఏ.ఈ.లు రమేష్,వెంకట నర్సు తదితరులు పాల్గొన్నారు.

# రైతాంగాన్ని ఆదుకునేలా బడ్జెట్

**హైదరాబాద్‌ను అభివృద్ధి చేసుకునేలా కేటాయింపులు**

**కెసిఆర్ హయాంలో ఇలా ఎప్పుడైనా చూశామా**

**బడ్జెట్‌పై విమర్శలను తిప్పికొట్టిన జగ్గారెడ్డి**

హైదరాబాద్,జూలై26 : తెలంగాణ అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ అద్భుతంగా, అభివృద్ధిని సాధించేదిగా, రైతాంగాన్ని ఆదుకునేదిగా ఉందని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. అలాగే రాజధాని హైదరాబాద్ అభివృద్ధిపై ఇంతగా గతంలో ఎవరు కూడా దృష్టి పెట్టలేదని అన్నారు. అయితే బీఆర్ఎస్ చీఫ్, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై హస్తం నేతలు మండిపడుతున్నారు. గత బీఆర్ఎస్ సర్కార్ హయాంలో హైదరాబాద్‌కు ఎన్ని నిధులు ఇచ్చారంటూ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం నాడు గాంధీభవన్‌లో జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడుతూ... తెలంగాణ అసెంబ్లీ నిన్న కాంగ్రెస్ సర్కార్ ప్రజా బడ్జెట్ ప్రవేశపెట్టిందని అన్నారు. బడ్జెట్ లోహైదరాబాద్‌కు భారీ నిధులు కేటాయించారన్నారు. హైదరాబాద్ సేఫ్‌గా ఉండాలని కోరుతూ నిధులు ఇచ్చారని తెలిపారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీలే, వాటర్ బోర్డు, మెట్రోలకు, హైడ్రాకు నిధులు ఇచ్చారని తెలిపారు. వ్యూహాత్మకంగానే జంటనగరాల అభివృద్ధికి నిధులు ఇచ్చారని చెప్పుకొచ్చారు. హైదరాబాద్‌లో వర్షాలు వస్తే కేసీఆర్ హయాంలో ఫామ్ హౌస్‌లో కూర్చొని మొసలి కన్నీరు పెట్టారని విమర్శించారు. పిట్ట కథలు చెప్పడంలో కేసీఆర్ దిట్ట అంటూ వ్యాఖ్యలు చేశారు. వాస్తవానికి దగ్గరలో బడ్జెట్ ఉందన్నారు. కేసీఆర్ హుస్సేన్ సాగర్ నీళ్లను కొబ్బరి నీళ్లు చేస్తా, మూసి నదిలో ఈతకొట్టేలా చేస్తా అని గప్పాలు కొట్టిండు అని అన్నారు. ఓల్డ్ సిటీ లో మౌలిక వసతులు లేవని తెలిపారు. మెట్రో విస్తరణకు నిధులు ఇచ్చారన్నారు. రూరల్ ప్రాంతంతో పాటు రాజధాని హైదరాబాద్ కోసం భారీగా నిధులు కేటాయించారని చెప్పారు. డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ చదువుతుంటే కేసీఆర్ బయటికొచ్చి విమర్శలు చేశారని మండిపడ్డారు. కేసీఆర్ పదేళ్ల కాలంలో హైదరాబాద్ చుట్టుపక్కల భూములు అమ్మడంపైనే, అప్పులు చేయడంపైనే ఫోకస్ చేశారన్నారు. ఎవరైనా భూములు అమ్మాలన్నా, అప్పులు చేయాలన్నా ఆయన వద్ద నేర్చుకోండని ఎద్దేవా చేశారు. పత్తాలు ఆడడం మాకు రావు, బీఆర్ఎస్.. బీజేపీ వాళ్ళకే వస్తాయ్ అంటూ జగ్గారెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కేసీఆర్‌పై గట్టిగానే విరుచుకుపడ్డారు. కేసీఆర్‌ను ప్రజలు చీల్చి చండాడితేనే ఎంపీ ఎన్నికల్లో ఒక్క సీటు గెలవక ఏడు సీట్లలో డిపాజిట్ కోల్పోయారని వ్యాఖ్యలు చేశారు.ఎనిమిది నెలలు ఇంట్లో ఉండి మధ్యలో రెండుసార్లు అసెంబ్లీ నడిచినా రాలేదని అంటూ కేసీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. దేశ చరిత్రలో తెలంగాణ రాష్ట్రానికి వ్యవసాయ రంగానికి 72 వేల కోట్లు కాంగ్రెస్ కేటాయించిందని చెప్పుకొచ్చారు. నువ్వు ఏనాడైనా పెట్టావా కేసీఆర్ అంటూ ప్రశ్నించారు. తెలంగాణకు అన్యాయం చేసేలా కేంద్రం ఘోరంగా బడ్జెట్ పెడితే ఎందుకు కేసీఆర్ మాట్లాడలేదని నిలదీశారు.

# మరోమారు ఉదారత చాటుకున్న లోకేశ్

**విదేశాల్లో మెడికల్ స్టూడెంట్‌కు వ్యక్తిగత సాయం**

అమరావతి,జూలై 26 : ఆంధ్రప్రదేశ్ విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. విదేశాల్లో చదువుతున్న తమ కుమార్తెకు ఫీజు చెల్లించలేని పరిస్థితిలో ఉన్నామంటూ ఆ కన్న తండ్రి ప్రజా దర్బార్‌లో వినతి పత్రాన్ని సమర్పించారు. దీనిపై నారా లోకేశ్ వెంటనే స్పందించారు. ఆయన.. తన వ్యక్తిగత నగదును ఆ విద్యార్థిని చదువు కోసం చెక్కు రూపంలో అందజేశారు. మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని చినకాకానికి చెందిన గండికోట కార్తీక.. ఉజ్బెకిస్థాన్‌లోని తాష్కెంట్ మెడికల్ అకాడమీలో మెడిసిన్ జనరల్ ప్రాక్టీషనర్ (ఫిజీషియన్) కోర్సు 4వ సంవత్సరం చదువుతోంది. అయితే గత జగన్ ప్రభుత్వం విధించిన అడ్డగోలు నిబంధనల కారణంగా కార్తీకకు విదేశీ విద్యకు ఎటువంటి సాయం అందలేదు. దీంతో ఆమె ఉజ్బెకిస్థాన్ వెళ్ల లేకపోయింది. అలాంటి వేళ.. మధ్య తరగతి కుటుంబానికి చెందిన తమ బిడ్డ చదువుకు సాయం అందించాలంటూ.. ఇటీవల కార్తీక తండ్రి శ్రీనివాసరావు ప్రజాదర్బార్లో వినతిపత్రం అందజేశారు. దీనిపై వెంటనే సంబంధిత విద్యార్థిని వివరాలు తెలుసుకోవాల్సిందిగా తన వ్యక్తిగత సిబ్బందిని మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. ఆ క్రమంలో ఈ ఏడాది ఆగస్టు 14వ తేదీ నాటికి కార్తీక 4వ ఏడాది ట్యూషన్ ఫీజు చెల్లించి.. కళాశాలకు వెళ్లాల్సి ఉంది. ఇక విదేశీ విద్య పథకానికి ఇంకా కొత్త గైడ్ లైన్స్ రూపొందించలేదు. దాంతో ప్రభుత్వం పరంగా విద్యార్థిని కార్తీకకు నేరుగా సాయం అందించే అవకాశం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో మంత్రి లోకేశ్ తనదైన శైలిలో స్పందిస్తూ.. కార్తీక ట్యూషన్ ఫీజుకు అవసరమైన రూ.1.43 లక్షలు తన సొంత నిధుల నుంచి సమకూర్చాలంటూ సిబ్బందిని ఆదేశించారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శనివారం
27 జూలై
2024





# దమ్ముంటే అసెంబ్లీకి రా..చర్చిద్దాం

**అప్పులపై చర్చకు సిద్ధమా జగన్**

**ఎపి అసెంబ్లీలో సిఎం చంద్రబాబు సవాల్**

**రాజకీయ కోసాధింపు మాకు చేతగాదని వెల్లడి**

అమరావతి,జూలై 26 : దమ్ముంటే అసెంబ్లీకి రా.. ప్రతి విషయంపై అసెంబ్లీలో చర్చ పెడదాం' అని మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి సీఎం నారా చద్రబాబు నాయడు సవాల్ విసిరారు. అసెంబ్లీలో శ్వేతప్రతాలు పెడితే చర్చించడానికి ధైర్యం ఉంటే అసెంబ్లీకి రావాలని జగన్‌కు చంద్రబాబు సవాల్ విసిరారు. రాజకీయ కక్షసాధింపు తనకు ఇష్టం ఉండదని అయితే హత్యలు చేసి తప్పించుకుంటా మంటే ఊరుకోమని చట్ట ప్రకారం శిక్షించి తీరుతామని సీఎం హెచ్చరించారు. 2019–24 మధ్య రాష్ట్రంలో భారీగా జరిగిన ఆర్థిక నిర్వహణ లోపాలపై అసెంబ్లీలో శ్వేతపత్రాన్ని సభ ముందు సీఎం చంద్రబాబు ఉంచారు. అసెంబ్లీలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ముఖ్యమంత్రి సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో ప్రజల తలసరి ఆదాయం పెరగలేదు కానీ వైసీపీ నేతల ఆదాయం వందల వేల లక్షల రెట్లు పెరిగిపోయిందని ఆరోపించారు. ఈ రాష్ట్రంలో పెట్టుబడులు పెడితే.. పాలన మారితే మళ్లీ పీకపై కత్తిపెడతానని పారిశ్రామిక వేత్తలను మాజీ సీఎం జగన్ బయపెడుతున్నారని సీఎం చంద్రబాబు విమర్శించారు. చివరకు అమర్‌రాజా హైదరాబాద్‌కు వెళ్లిపోయేలా చేశారని మండిపడ్డారు. లూలూ షాపింగ్ మాల్‌ను తాను ఎన్నో ఇబ్బందులు పడి తీసుకువస్తే గత పాలకులు వెళ్లిపోయేలా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.వినుకొండ ఘటనలో ఇద్దరు వైసీపీ నేతలేనని స్పష్టం చేశారు. ఈ కేసులో మొత్తం 36మంది ఉన్నారని ఆరోపిస్తున్నారని ధైర్యం ఉంటే వారి పేర్లు ఇవ్వాలని అన్నారు. ఎవరైనా తప్పు చేస్తే తమ పార్టీ నేతలైనా శిక్షిస్తామని వార్నింగ్ ఇచ్చారు. హత్యలు చేసిన వారిని వదిలి పెట్టం వడ్డీతో సహ చెల్లిస్తామని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. నేరస్తులను నేరస్తులుగానే చూస్తాం.. రాజకీయ ముసుగులో దాగనివ్వం. జగన్ మాట్లాడితే రూ.2 లక్షల 71 వేల కోట్లు బటన్ నొక్కానని అంటారు. మీరు రూ.9 లక్షల 74 వేల కోట్లు అప్పు ఏపీ కోసం తెచ్చానని చెప్పి ఏం చేశారో చెప్పాలి. మద్యపాన నిషేధమని ఎవ్వరు చెప్పారు నేను చెప్పానా మీరు చెప్పారు. మద్యంపై భవిష్యత్తు ఆదాయాన్ని తాకట్టు పెట్టారు. విశాఖ రాజధాని అని చెప్పి అక్కడి ఆస్తులను కూడా తాకట్టు పెట్టారు. మదనపల్లిలో సబ్ కలెక్టర్ ఆఫీసులో 22 ఏ ఫైళ్లు తగలబెడితే అది అగ్ని ప్రమాదం అంటారా..? దాన్ని విచారణ చేయిస్తే తప్పా. మాజీ మంత్రి వివేకాది గుండెపోటు అంటే నమ్మాలా..? చివరకు మీరే చంపారు అంటే ఒప్పుకోవాలా..? తర్వాత ఆదినారాయణ రెడ్డి చంపేశారు అన్నారు. ముచ్చుమర్రిలో తప్పుచేసిన వారిని వదిలి పెట్టమని చూపించాం. రైతుల ఆదాయం తగ్గిపోయింది. దేశంలోనే ఎక్కువ అప్పు ఉన్న రైతులు రాష్ట్రంలో ఉన్నారు. త్వరగా ఆర్థిక వ్యవస్థను రివైవ్ చేస్తాం. ఎమ్మెల్యేలు ఒక రోడ్డు వేసుకోవాలంటే ఇవ్వలేని పరిస్థితి ఏపీలో ఉంది. నేను సీఎంగా ఉన్న నాలుగు టర్మ్‌లలో ఇలాంటి పరిస్థితి లేదు.. వైసీపీ పాలనలో వచ్చిందని చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వినుకొండ ఘటనలో చంపినవారు ఎవరు..?.. చచ్చిపోయిన వారు ఎవరు..? నీకు సిగ్గుందా..? రాజకీయ ముసుగులో ఎదురుదాడి చేస్తావా...? ఆ ముసుగు తీస్తాం..?మీ బాబాయ్‌ని ఎవరు చంపాడో బయటకు తీయాలి. మాకు బాధ్యత ఉంది.. తప్పనిసరిగా బయటకు తీస్తాం. 36 మందిని మేము చంపామని అన్నావ్...? వాళ్ల పేర్లు చెప్పండి. అందులో నిజం ఉంటే నేను చర్యలు తీసుకుంటాం. అప్పుల గురించి అబద్దాలు చెప్పారు. రూ. 2 లక్షల 75 వేల కోట్లు బటన్ నొక్కి వేశామని చెప్పారు. మరి మిగతా డబ్బులు ఎక్కడ..? రూ. 9 లక్షల 73 వేల కోట్లు అప్పు మీ హయాంలో ఎలా జరిగింది..? మదనపల్లి సబ్ కలెక్టర్ ఆఫీస్‌లో అగ్నిప్రమాదం ఎలా జరిగింది..? అది అగ్నిప్రమాదమని జగన్ అబద్దాలు చెబుతున్నారు. రికార్డ్‌లను కూడా సరి చేయాల్సిన అవసరం ఉంది. బడ్జెట్ సమయంలో అన్ని విషయాలు మాట్లాడుకుందాం. ఎవరో చేసిన తప్పుకు మనం ఫలితం అనుభవి స్తున్నాం. ఎమ్మెల్యేలు వచ్చి ఒక రోడ్డు అడిగితే ఇవ్వలేని పరిస్థితి. నేను మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో ఎప్పుడు ఇలా చేయలేదు. అని చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# సత్వరమే పెద్దవాగు మరమ్మత్తులు

**ఈ సీజన్లోనే నీళ్లు ఇచ్చేలా ప్రణాళికలు**

**అధికారులను ఆదేశించిన మంత్రి తుమ్మల**

హైదరాబాద్,జూలై 26 : పెద్దవాగు ప్రాజెక్టు ఆయకట్ట మరమ్మత్తు పనులు సత్వరమే చేపట్టాలని ఇరిగేషన్ అధికారులకు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఆదేశించారు.ఈ వానాకాలంలోనే రైతులకు సరిపడ సాగునీరు అందే విధంగా యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని మ-రమ్మత్తులు కోసం ఎస్టిమేట్స్ సిద్ధం చేయాలని సూచించారు. ప్రాజెక్టు తాత్కాలిక మరమ్మత్తులు, బండ్ ఫార్మేషన్ అప్రోచ్ కెనాల్ పనులు కోసం అడిగినే వెంటనే స్పందించి సీఎం రేవంత రెడ్డి , నీరు పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి నిధులు మంజూరు చేసిన్నట్లుగా ఆయన తెలిపారు. రూ. 3 కోట్ల 50 లక్షలతో ఎస్టిమేట్స్ సిద్ధం చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. ఈ సీజన్ లోనే ప్రాజెక్ట్ తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టి ఆయకట్టు కింద రైతుల పంటలకు సాగునీరు ఇవ్వాలని ఇరిగేషన్ అధికారులకు మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. పెద్దవాగు ప్రాజెక్ట్ మరమ్మత్తు పనులు కోసం వెంటనే స్పందించి నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# బిఆర్ఎస్ కాళేశ్వరం విహారయాత్ర

**ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి విమర్శ**

హైదరాబాద్,జూలై 26 : బీఆర్ఎస్ లీడర్లంతా కాళేశ్వరం విహార యాత్రకు వెళ్లారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి విమర్శించారు. కుంగిన పిల్లర్లు చూసి కేటీఆర్ మాట్లాడాలన్నారు. కాళేశ్వరం అప్పులకు కేసీఆరే బాధ్యుడన్నారు. 30 వేల కోట్ల ఖర్చు అయ్యే ప్రాజెక్టుకు లక్షా 20 వేల కోట్లు ఖర్చు చేశారని ఫైరయ్యారు. వాస్తవాలను కప్పి పుచ్చుకోవడానికే విహారయాత్రల పేరుతో డ్రామాలు ఆడుతున్నారని చెప్పారు. చేసిన తప్పులకు శిక్ష తప్పదన్నారు జీవన్ రెడ్డి. ఇప్పటికైనా కేసీఆర్ వాస్తవాలు గ్రహించి..తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. ఇవాళ కాళేశ్వరం పర్యటనలో భాగంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు భాగంగా కన్నెపల్లి పంప్ హౌస్, మేడిగడ్డ ప్రాజెక్ట్ సందర్శించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా.. ఆగస్టు 2 లోపు కాళేశ్వరం పంపు హౌసులు ఆన్ చేసి ప్రాజెక్టులకు నీళ్లివ్వాలని ప్రభుత్వానికి డెడ్ లైన్ విధించారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. లేదంటే కేసీఆర్ ఆధ్వర్యంలో 50 వేల మందితో తామే పంపు హౌసులు ఆన్ చేస్తామని హెచ్చరించారు.

# గోదావరి వరద బాధితుల్ని ఆదుకుంటాం

**అసెంబ్లీలో సిఎం చంద్రబాబు హామీ**

అమరావతి,జూలై 26 : గోదావరి వరద బాధితుల్ని ఆదుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. శుక్రవారం శాసనసభలో ఆయన మాట్లాడుతూ.. తూర్పు, పశ్చిమగోదావరి, కోనసీమ, కాకినాడ, ఏలూరు జిల్లాలు వరద ప్రభావానికి గురయ్యాయని తెలిపారు. 4317 ఎకరాల్లో వరి పంట దెబ్బతింది. 1.06 లక్షల ఎకరాల్లో వరి నాట్లు ముంపునకు గురయ్యాయి. మొక్కజొన్న, పత్తి లాంటి పంటలు కూడా దెబ్బతిన్నాయి. అల్లూరి జిల్లాలోనూ కొన్ని చోట్ల వరద ప్రభావం ఉంది. ఇళ్లు నీట మునిగిన బాధితుల కోసం ప్రభుత్వం సహాయక శిబిరాలు ఏర్పాటు చేసింది. శిబిరాల్లో ఉన్న వారికి రూ.3వేల చొప్పున ఆర్థిక సాయం, 25 కేజీల బియ్యం, లీటర్ పామాయిల్, కందిపప్పు, బంగాళదుంపలు, ఉల్లిపాయలు కేజీ చొప్పున అందిస్తాం. వ్యవసాయశాఖ, హోంశాఖ మంత్రులు క్షేత్రస్థాయికి వెళ్లి వరదబాధితుల్ని పరామర్శించాలని ఆదేశించా. దిల్లీలో నీతిఆయోగ్ సమావేశం కారణంగా బాధితుల్ని పరామర్శించేందుకు వెళ్లలేకపోతున్నా. పంట నష్టాన్ని ప్రాథమికంగా అంచనా వేయాలని మంత్రులు, అధికారులకు ఆదేశాలిచ్చాం' అని సీఎం తెలిపారు.

# కన్నెపల్లిని సందర్శించిన బిఆర్ఎస్ బృందం

కరీంనగర్,జూలై 26 : బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శన రెండో రోజు కొనసాగుతున్నది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో హైదరాబాద్ నుంచి బయల్దేరిన ప్రజా ప్రతినిధుల బృందం.. గురువారం సాయంత్రం కరీంనగర్‌లో లోయర్ మానేరు రిజర్వాయర్‌ను పరిశీలించిన విషయం తెలిసిందే. శుక్రవారం ఉదయం రామగుండం ఎన్టీపీసీ నుంచి కన్నెపల్లికి బయల్దేరి వెళ్లిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు.. మంచిర్యాల జిల్లా ఇందారం వద్ద నీటి ప్రవాహం లేక ఎండిపోయిన గోదావరి నదిని పరిశీలించారు. అనంతరం కాళేశ్వరం ఆలయానికి చేరుకున్న కేటీఆర్‌కు ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. స్వామి సన్నిధిలో కేటీఆర్ ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం కన్నెపల్లి పంపు హౌజ్‌కు చేరుని పంప్ హౌస్‌ను పరిశీలించారు.

# వ్యవసాయరంగానికి పెద్దపీట వేసాం

**బడ్జెట్‌లో 72 వేల కోట్లు కేటాయించాం**

**హుస్సేన్ సాగర్‌ను కొబ్బరినీళ్లా చేస్తామన్నావ్**

**మూసీలో ఈతకొట్టేలా చేస్తానని ప్రగల్భాలు పలికావు**

**గప్పాలు కొట్టే చరిత్ర నీదే అంటూ మంత్రి జూపల్లి విమర్శలు**

హైదరాబాద్,జూలై 26 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంతా ట్రాష్.. గ్యాస్ అని.. ఈస్ట్‌మన్ కలర్ మాదిరిగా చెప్పారని.. ఓ కథ చెప్పినట్లు ఉందంటూ బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ... 2023లో రెండు లక్షల తొంభై వేల కోట్లు ఖర్చు చేసినట్టు కేసీఆర్ ప్రజలకు చూపించారని.. ఆదాయాన్ని ఎక్కువగా చూపించి ప్రజలను మోసం చేసినప్పుడు.. అది గ్యాస్, ట్రాష్ కాదా? అని సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ బడ్జెట్‌లో 25 శాతం వ్యవసాయానికి ఖర్చుపెడితే.. 15 శాతం గత ప్రభుత్వం అప్పులు తీర్చడంలోనే సరిపోతుందని తెలిపారు.కేసీఆర్ అమల్లోకి తెచ్చిన రైతు బంధుని రైతు భరోసాగా మార్చి కొనసాగించామన్నారు. రైతు పండించిన ధాన్యానికి అదనంగా 500 రూపాయిలు బోనస్ ఇచ్చామన్నారు. ఏడు నెలలకే తాము 30,000 కోట్ల అప్పు తెచ్చామని కేసీఆర్ మాట్లాడుతున్నారని.. తాము తెచ్చిన అప్పు బీఆర్ఎస్ చేసిన అప్పులు తీర్చడానికే సరిపోతుం దంటూ వ్యాఖ్యలు చేశారు. 'అసెంబ్లీకి కేసీఆర్ ఇన్నిరోజులు ఎందుకు రాలేదు? అంత గర్వమా? కేసీఆర్ కన్నా రేవంత్ రెడ్డిది చిన్న వయసు కాబట్టి ఆయన ముందు అసెంబ్లీలో కూర్చోవడానికి కేసీఆర్‌కు చిన్న చూపా?' ప్రశ్నల వర్షం కురిపించారు. ఆరు గ్యారంటీలు కూడా ఒక్కొక్కొటిగా అమలు చేస్తున్నప్పటికీ కేసీఆర్ తమపై విమర్శలు చేస్తూన్నారని మంత్రి జూపల్లి కృష్ణా రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు కేసీఆర్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. హైదరాబాద్‌లో వర్షాలు వస్తే కేసీఆర్ హయాంలో ఫామ్ హౌస్‌లో కూర్చొని మొసలి కన్నీరు పెట్టారని జగ్గారెడ్డి విమర్శించారు. పిట్ట కథలు చెప్పడంలో కేసీఆర్ దిట్ట అంటూ వ్యాఖ్యలు చేశారు. వాస్తవానికి దగ్గరలో నిన్నటి బ్జడెట్ ఉందన్నారు. కేసీఆర్ హుస్సేన్ సాగర్ నీళ్లను కొబ్బరి నీళ్లు చేస్తా, మూసి నదిలో ఈతకొట్టేలా చేస్తా అని గప్పాలు కొట్టిండు అని అన్నారు. ఓల్డ్ సిటీ లో మౌలిక వసతులు లేవని తెలిపారు. మెట్రో విస్తరణకు నిధులు ఇచ్చారన్నారు. రూరల్ ప్రాంతంతో పాటు రాజధాని హైదరాబాద్ కోసం భారీగా నిధులు కేటాయించారని చెప్పారు. డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క బ్జడెట్ చదువుతుంటే కేసీఆర్ బయటికొచ్చి విమర్శలు చేశారని జగ్గారెడ్డి మండిపడ్డారు.

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా కేసీఆర్‌పై మండిపడ్డారు. కేసీఆర్‌ను ప్రజలు చీల్చి చండాడితేనే ఎంపీ ఎన్నికల్లో ఒక్క సీటు గెలవక ఏడు సీట్లలో డిపాజిట్ కోల్పోయారని వ్యాఖ్యలు చేశారు. 'నీ స్థానంలో ఎవరున్నా రాజకీయాలు బంద్ చేసుకొని శాశ్వతంగా రాజకీయాలు విరమించుకోవాలి. ఎనిమిది నెలలు ఇంట్లో ఉండి మధ్యలో రెండుసార్లు అసెంబ్లీ నడిచినా రాలేదు' అంటూ కేసీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. దేశ చరిత్రలో తెలంగాణ రాష్ట్రానికి వ్యవసాయ రంగానికి 72 వేల కోట్లు కాంగ్రెస్ కేటాయించిందని చెప్పుకొచ్చారు. 'నువ్వు ఏనాడైనా పెట్టావా కేసీఆర్' అంటూ ప్రశ్నించారు. తెలంగాణకు అన్యాయం చేసేలా కేంద్రం ఘోరంగా బ్జడెట్ పెడితే ఎందుకు కేసీఆర్ మాట్లాడలేదని మంత్రి కోమటిరెడ్డి నిలదీశారు.

# తగ్గుతున్న బంగారం ధరలు

**బడ్జెట్ తరవాత ఐదువేల వరకు తగ్గింపు**

**కొనుగోళ్లు పెరిగాయంటున్న వ్యాపారులు**

న్యూఢిల్లీ,జూలై 26 : దేశీయంగా బంగారం ధరలు భారీగా తగ్గుముఖం పట్టడంతో కొనుగోళ్లు కూడా పెరుగుతున్నాయి. కస్టమ్స్ డ్యూటీ తగ్గింపు తర్వాత ఆభరణాల కొనుగోలుకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. దీపావళి, దంతేరస్ వంటి పండగలు, వివాహాది శుభకార్యాలు ముందుండడంతో ఆభరణాల కొనుగోలుకు డిమాండ్ పెరిగినట్లు వర్తకులు చెబుతున్నారు. సాధారణ రోజులతో పోలిస్తే సుమారు 20 శాతం మేర డిమాండ్ పెరిగినట్లు పేర్కొంటున్నారు. నగల గురించి ఆరా తీసే వారి సంఖ్య కూడా పెరిగిందంటున్నారు. దీంతో కొన్ని సంస్థలు ఆభరణాల తయారీదారుల సెలవులు కూడా రద్దు చేసినట్లు తెలుస్తోంది. ఎప్పటినుంచో బంగారం కొనాలనుకుంటున్నవారంతా ఇప్పుడు తమ కలను సాకారం చేసుకుంటున్నారని వర్తకులు చెబుతున్నారు. అయితే, ఒకేసారి డిమాండ్ పెరిగితే ప్రభుత్వం ఎక్కడ మళ్లీ సుంకాన్ని పెంచుతుందోనన్న భయాలూ కొందరు వర్తకుల్లో నెలకొనడం గమనార్హం. బడ్జెట్ తర్వాత స్థానిక మార్కెట్‌లో 10 గ్రాముల పసిడి ధర దాదాపు రూ.5 వేల మేర దిగొచ్చింది. కస్టమ్స్ సుంకాన్ని భారీగా తగ్గించడమే దీనికి ప్రధాన కారణం. దీంతో నగల దుకాణాల్లో ఒక్కసారిగా రద్దీ పెరిగింది. మరికొన్ని రోజుల్లో పండగల సీజన్ ప్రారంభం కానున్నవేళ బంగారాన్ని కొనుగోలు చేసేందుకు జనం పోటీపడుతున్నారు. బంగారం ధర భారీగా తగ్గిన నేపథ్యంలో బంగారంలో పెట్టుబడులు పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. బంగారంపై కస్టమ్స్ డ్యూటీని 15 శాతం నుంచి 6 శాతానికి తగ్గించడంతో దిగుమతి భారం

తగ్గింది. పసిడి అక్రమరవాణాను అరికట్టేందుకు సుంకం తగ్గించాలన్న డిమాండ్ ఎప్పటినుంచో ఉంది. ఈ నేపథ్యంలో సుంకాన్ని తగ్గించడంతో సుమారు కిలోకు రూ.3.90 లక్షల వరకు ధర తగ్గడం గమనార్హం. బ్జడెట్ తర్వాత 10 గ్రాముల బంగారం మీద రూ.5 వేలు మేర తగ్గింది. అటు వెండి కిలోకు రూ.7 వేల వరకు తగ్గి ప్రస్తుతం రూ.84 వేలు పలుకుతోంది. ధర తగ్గడం వల్ల రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి బంగారంపై పెట్టుబడులు పెరిగే అవకాశం ఉందని నిపుణులు పేర్కొన్నారు. భౌతిక బంగారంగానే కాకుండా.. పెట్టుబడి సాధనంగానూ బంగారాన్ని పరిశీలించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ద్రవ్యోల్బణాన్ని, కరెన్సీ విలువ పతనాన్ని తట్టుకొని నిలబడగలిగే శక్తి పసిడికి ఉండడమే దీనికి కారణమని చెప్పారు. ఈ నిర్ణయం వల్ల స్మగ్లింగ్ మాఫియాకు అడ్డుకట్ట వేయడంతో పాటు వ్యవస్థీకృత మార్కెట్ ద్వారా ప్రభుత్వానికి జీఎస్టీ, ఆదాయపు పన్ను రూపంలో రెవెన్యూ సమకూరుతుందని నిపుణులు చెబుతున్నారు. బంగారం ధరలో స్థిరత్వం అనేది అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల నిర్ణయం, వివిధ దేశాల ఆర్థిక, భౌగోళిక రాజకీయ పరిస్థితులపై ఆధారపడి ఉంటుందని చెబుతున్నారు.

# నీతి ఆయోగ్ సమావేశ బహిష్కరణ

**ఆనాడు కెసిఆర్ బహిష్కరిస్తే విమర్శలు**

**కాంగ్రెస్ పార్టీది ద్వంద్వ వైఖరన్న కెటిఆర్**

హైదరాబాద్,జూలై 26 : నీతి అయోగ్ సమావేశ బహిష్కరణపై కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న ద్వంద్వ వైఖరిని కేటీఆర్ నిలదీశారు. తెలంగాణ పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా ప్రధాని మోదీతో సమావేశాన్ని నాడు కేసీఆర్ బాయ్‌కాట్ చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ తప్పుపట్టిందని, ఇరువురు కుమ్మక్కయ్యారని ఆరోపించిందని చెప్పారు. మరి ఇప్పుడు నీతి అయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నాని రేవంత్ రెడ్డి స్వయంగా ప్రకటించడంపై కాంగ్రెస్ ఏం చెబుతుందని ప్రశ్నించారు. ప్రధాని మోదీని చోటే భాయ్ ఎందుకు కలవానుకోవడం లేదు?, కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ఎందుకు మాట్లాడాలని ఎందుకు అనుకోవడం లేదని ఎక్స్ వేదికగా నిలదీశారు. తెలంగాణ పట్ల కేంద్రం అనుసరిస్తున్న పక్షపాత వైఖరికి నిరసనగా నీతి అయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్టు అప్పట్లో సీఎం కేసీఆర్ ప్రకటిస్తే పీసీసీ అధ్యక్షునిగా ఉన్న ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి తప్పుపట్టారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రధానిని నిలదీయడానికి నీతి అయోగ్ సమావేశం ఒక మంచి అవకాశమని వాదించారు. ఆ సమావేశానికి సీఎం కేసీఆర్ వెళ్లాలని డిమాండ్ చేశారు. అదే రేవంత్‌రెడ్డి ఇప్పుడు సీఎంగా కేంద్ర బ్జడెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయానికి నిరసనగా నీతి అయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తు న్నట్టు బుధవారం శాసనసభలో ప్రకటించిన విషయం తెలిసిందే. నీతి అయోగ్ సిఫారసులకు కేంద్రం విలువ ఇవ్వనప్పుడు ఆ సమావేశానికి వెళ్లడంలో అర్థం లేదనే బహిష్కరిస్తున్నట్టు రెండేండ్ల కిందట సీఎం కేసీఆర్ ప్రకటించారు. మిషన్ కాకతీయకు రూ.5 వేల కోట్ల గ్రాంట్, మిషన్ భగీరథకు రూ.19,500 కోట్ల గ్రాంట్ తెలంగాణకు ఇవ్వాలని నీతి అయోగ్ చేసిన సిఫారసును కేంద్రం పట్టించుకోకపోవడంతో.. నిరసనగా నీతిఆయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్టు కేసీఆర్ వివరించారు.

# అమరవీరులకు జోహార్లు అర్పించిన టిడిపి ,బిజెపి జనసేన



శ్రీశైలం, జూలై 26. ( రోమింగ్ న్యూస్.) నంద్యాల జిల్లా శ్రీశైలం మండలం సున్నిపెంట గ్రామంలో ఈరోజు26వ కార్గిల్ విజయ్ దివాస్ కార్యక్రమం శ్రీశైలం మండలం సుండీపెంట గ్రామం నందు జరపడం జరిగింది. ఈ సందర్భంగా కార్గిల్ అమరవీరుల సైనికులకు జోహార్లు తెలియజేయడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమం నందు శ్రీశైలం మండలం అధ్యక్షులు మాయలూరు వెంకటేశ్వర్లు, మల్లికార్జున, గల్లీ వెంకటేశ్వర్లు, చిక్కుడు చెట్టు వెంకటేశ్వర్లు, చదువుల శీను, తెలుగుదేశం పార్టీ నాయకులు ఖాతారామిరెడ్డి, సుబ్బారావు, మల్లేష్, ఉమా, జనసేన నాయకులు రౌతు అశోక్ కుమార్ ,కొట్టే సురేందర్, నాగసాయి, మల్లికార్జున, లింగాల గట్టు బుజ్జి , కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాహుల్‌కు కొత్త బంగ్లా కేటాయింపు

**సునేహ్రి బాగ్ రోడ్‌లోని బంగ్లా నెంబర్–5**

న్యూఢిల్లీ,జూలై 26 : కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి కేంద్ర ప్రభుత్వం కొత్త భవనం కేటాయించింది. సునేహ్రి బాగ్ రోడ్‌లోని బంగ్లా నెంబర్–5ను ఆయనకు హౌస్ కమిటీ ఆఫర్ చేసింది. ఇంతకుముందు బీజేపీ చిత్రదుర్గ ఎంపీ ఎ.నారాయణస్వామి ఈ బంగ్లాలో ఉండేవారు. 2019లో సహాయ మంత్రిగా పనిచేసిన ఆయనకు 2024 ఎన్నికల్లో టిక్కెట్ లభించలేదు. రాహుల్ గాంధీ గత ఏడాది పరువునష్టం కేసులో రెండేళ్లు జైలు శిక్ష పడి లోక్‌సభలో అనర్హత వేటు పడటంతో 12 తుగ్లక్ రోడ్డులోని నివాసాన్ని ఖాళీ చేశారు. అప్పట్నించి తన తల్లి సోనియాగాంధీ ఉంటున్న 10 జన్‌పథ్‌లోనే ఆమెతో ఉంటున్నారు. కాగా, ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాహుల్ ఉత్తరప్రదేశ్‌లోని రాయబరేలి, వయనాడ్ నియోజకవర్గాల నుంచి ఎంపీగా గెలుపొందారు. ఒక నియోజకవర్గాన్ని వదులుకోవాల్సి రావడంతో వయనాడ్ నియోజకవర్గానికి రాజీనామా చేశారు. అనంతరం లోక్‌సభ ప్రతిపక్ష నేతగా ఎంపిక కావడంతో క్యాబినెట్ ర్యాంకు హోదా లభించింది. దీంతో సునేహ్రి బాగ్ రోడ్డులోని బంగ్లా నెంబర్–5ని హౌస్ కమిటీ ఆయనకు తాజా ఆఫర్ చేసింది. అయితే రాహుల్ ఇంకా తన నిర్ణయాన్ని చెప్పాల్సి ఉంది. రాహుల్ సోదరి ప్రియాంక గాంధీ శుక్రవారంనాడు సునేహ్రి బాగ్‌లోని బంగ్లాను చూసేందుకు శుక్రవారం వచ్చారు. కాగా, రాహుల్‌కు కేబినెట్ హోదా ప్రకారం టైప్–8 బంగ్లా ఆఫర్ చేసామని, ఆయన తన సమ్మతి తెలపగానే ఫార్మల్ నోటిఫికేషన్ జారీ అవుతుందని డైరెక్టరేట్ ఆఫ్ ఎస్టేట్స్ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. విశ్వసనీయ వర్గాల కథనం ప్రకారం ఇంతవరకూ తొమ్మిది మంది మంత్రులకు ప్రభుత్వ బంగ్లాలు కేటాయించారు.

# నేడు నీతి ఆయోగ్ సమావేశం

**ప్రధాని మోడీ అద్యక్షతన భేటీ.. భేటీని బహిష్కరించిన సిఎం రేవంత్**

న్యూఢిల్లీ,జూలై26 : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన 'నీతి ఆయోగ్' 9వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం శనివారంనాడు జరుగనుంది. న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ కల్చరల్ సెంటర్‌లో ఈ సమావేశం జరుగుతుందని శుక్రవారంనాడు ఒక అధికార ప్రకటన వెలువడింది. అయితే ఈ భేటీని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. తెలంగాణకు బడ్జెట్‌లో అన్యాయానికి నిరసనగా ఈ నిర్నయం తీసుకున్నారు. ఎపి సిఎం చంద్రబాబు సమావేశం కోసం డిల్లీకి బయలుదేరారు. 'వికసిత్ భారత్‌అ2047' అనే థీమ్‌తో, అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను రూపొందించడంపై ఈ సమావేశం దృష్టి సారించనుంది. వికసిత్ భారత్ అ2047 విజన్ డాక్యుమెంట్ కోసం అప్రోచ్ పేపర్‌పై సమావేశం చర్చిస్తుందని ఆ ప్రకటన తెలిపింది. కేంద్ర, రాష్ట్రాల మధ్య పరస్పర సహకారాన్ని వేగవంతం చేయడం, గ్రామీణ–పట్టణ జనాభా జీవన ప్రమాణాలను పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నీతి ఆయోగ్ సమావేశంలో చర్చించనున్నారు. 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల కంటే ఎక్కువ జీడీపీతో భారతదేశం మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలవాలనే లక్ష్యాన్ని భారతదేశం నిర్దేశిరచుకుంది. 2047 నాటికి ఈ లక్ష్యం సాధించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య కొలాబొరేటివ్ అప్రోచ్ ఉండేలా నీతి ఆయోగ్ 9వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం చర్చించి, ఈ విజన్ సాకారానికి రోడ్ మ్యాప్‌ను రూపొందించనుంది. 2023 డిసెంబర్ 27–29 మధ్య జరిగిన 3వ చీఫ్ సెక్రటరీల జాతీయ సదస్సులో చేసిన సిఫారసులపై కూడా నీతి ఆయోగ్ సమావేశంలో చర్చించనున్నారు. నాటి సదస్సులో చర్చకు వచ్చిన సైబర్ సెక్యూరిటీ, ఆస్పిరేషనల్ డిస్టిక్స్ అండ్ బ్లాంక్స్ ప్రోగ్రామ్, రోల్ ఆఫ్ స్టేట్, ఎఐ ఇన్ గవర్నెన్స్ అంశాలపై కూడా స్పెషల్ సెషన్స్ నిర్వహించనున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షత వహించే నీతి ఆయోగ్ సమావేశంలో రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు, ఎక్స్ అఫీసియో మెంబర్లు, ప్రత్యేక ఆహ్వానితులుగా కేంద్ర మంత్రులు, వైస్ చైర్మన్, నీతి ఆయోగ్ సభ్యులు పాల్గొనున్నారు.

# హైదరాబాద్‌లో బోనాల పండగ

**రెండ్రోజుల పాటు వైన్ షాపుల మూత**

హైదరాబాద్,జూలై 26 : హైదరాబాద్ నగరంలో ఆది, సోమవారాల్లో వైన్స్ షాపులు బంద్ కానున్నాయి. మహంకాళీ బోనాల పండుగ ను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ అంతటా.. నాన్ ప్రొప్రయిటరీ క్లబ్ లు, స్టార్ హోటళ్లు, రెస్టారెంట్‌లతో సహా అన్ని వైన్స్ షాపులు మూసివేయబడతాయని సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. ఎల్లుండి జూలై 28 ఉదయం 6 గంటల నుంచి రెండు రోజుల పాటు వైన్స్ షాపులన్నీ మూసివేయబడతాయి. సౌత్ ఈస్ట్ జోన్‌లో చాంద్రాయణగుట్ట , బండ్లగూడ వంటి ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 6 గంటలనుంచి 24 గంటల వరకు మద్యం దుకాణాలు మూసివేయ బడతాయి. సౌత్ జోన్‌లో చార్మినార్, కమాటిపుర, హుస్సేనీ ఆలం, ఫలక్‌నుమా, మొఘల్‌పురా, చైటినాక, షాలి బండ , మీర్‌చౌక్ ప్రాంతాల్లో జూలై 28 ఉదయం 6 గంటలనుంచి రెండు రోజుల పాటు కల్లు, వైన్ షాపులు, హోటళ్లు, రెస్టారెంట్లను , క్లబ్బులు , మద్యం విక్రయించే లేదా అందించే ఇతర సంస్థలు మూసివేయబడతాయని సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

# గోల్కొండలో పంద్రాగస్ట్ వేడుకలు

**అధికారులతో సమీక్షించిన సిఎస్ శాంతికుమారి**

హైదరాబాద్,జూలై 26 : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి పంద్రాగస్టు వేడుకలకు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సీఎస్ ఆదేశించారు. డీజీపీ జితేందర్, జీఏడీ కార్యదర్శి రఘునందన్ రావు, పోలీసు, విద్యుత్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, ఆర్అండ్‌బీ తదితర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో సీఎస్ పలు సూచనలు చేశారు.

గోల్కొండ కోటలో స్వాతంత్య దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తెలిపారు. ముందుగా ముఖ్యమంత్రి పరేడ్ గ్రౌండ్‌లోని సైనిక అమరవీరుల స్మారక స్థూపం వద్ద నివాళులర్పిస్తారని చెప్పారు. అనంతరం గోల్కొండ కోటలో జాతీయ పతాకాన్ని ఎగుర వేస్తారని ఆమె తెలిపారు. వేడుకల సందర్భంగా అసెంబ్లీ, కౌన్సిల్, హైకోర్టు, రాజ్‌భవన్, సెక్రటేరియట్ భవనాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని సంబందిత అధికారులను సీఎస్ ఆదేశించారు. జాతీయ పతాకం ఎగురవేసే ప్రధాన డయాస్ వద్ద తగిన ఏర్పాట్లు చేయాలని ఆర్ అండ్ బీ శాఖను సీఎస్ కోరారు. ముఖ్యమంత్రి ప్రసంగిస్తున్న సమయంలో ఆయనను అతిథులు అందరూ చూసేందుకు వీలుగా ప్రధాన డయాస్ ఏర్పాట్లు ఉండాలన్నారు. వేడుకలు నిర్వహించే పరిసర ప్రాంతాలలో తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, ఎప్పటికప్పుడు చెత్తను శుభ్రం చేస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వంటి పారిశుధ్య పనులలో ఎలాంటి లోపాలు ఉండరాదని పురపాలక శాఖను ఆదేశించారు. అంబులెన్స్, నర్సింగ్ అసిస్టెంట్లను అందుబాటులో ఉంచాలని ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. ప్రముఖులకు, అధికారులకు, వేడుకకు హాజరయ్యేవారికి ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలను కేటాయించడంతో పాటు ట్రాఫిక్ రూట్ మ్యాప్‌ను సిద్ధం చేయాలని పోలీసు శాఖకు సూచించారు. అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచాలని ...ర్ శాఖను, అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. వెయ్యి మంది కళాకారులతో ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నామని కల్చరల్ డిపార్ట్‌మెంట్ అధికారులు సీఎస్‌కు తెలిపారు. సాంప్రదాయ వస్త్రధారణతో కళాకారుల ప్రదర్శనలు వేదికకు వన్నె తెచ్చేలా ఉంటాయని అధికారులు వివరించారు. వచ్చేనెల 13న ఫుల్ డ్రెస్ రిహార్సల్స్ జరగనుండగా 10వ తేదీ నుంచి రిహార్సల్స్ ఉంటాయని అధికారులు వివరించారు.

# స్మితా సబర్వాల్ వ్యాఖ్యలు శోచనీయం

## వెనక్కి తీసుకోవాలన్న కోదండరామ్

హైదరాబాద్,జూలై 26 : ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ వ్యాఖ్యలపై విమర్శలు కొనసాగుతున్నాయి. తన వ్యాఖ్యలపై ఆమె క్షమాపణలు చెప్పాలన్న డిమాండ్‌ను పట్టించుకోవడం లేదు. తాజాగా తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ఆచార్య కోదండరాం మండిపడ్డారు. దివ్యాంగులపై ఆమె చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. వైకల్యం పేరుతో వారి హక్కులను హరించడం సరైంది కాదన్నారు. దివ్యాంగులు కొన్ని ఉద్యోగాలకు పనికిరారని స్మితా సబర్వాల్ చేసిన వ్యాఖ్యలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. వాళ్లు సకాలంగుల కంటే ఎంతో ఉన్నత శిఖరాలను అధిరోహించారు. చట్టాలను అమలు చేయాల్సిన ఏఐఎస్ అధికారిణి వైకల్యాన్ని కించపర్చడం సమంజసం కాదని అన్నారు. స్మితా సబర్వాల్.. తను చేసిన వ్యాఖ్యలను వెనక్కితీసుకోకపోగా.. సమర్థించుకోవడం శోచనీయం అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు ఎవరూ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని కోదండరాం అన్నారు.

# లంచం తీసుకుంటూ పట్టుబడ్డ అధికారులు

వరంగల్,జూలై 26 : వివిధ ప్రాంతాల్లో లంచం తీసుకుంటూ ఇద్దరు ప్రభుత్వాధికారులు ఏసిబికి పట్టుబడ్డారు. హనుమకొండ జిల్లా పరకాల మున్సిపాలిటీ పరిధిలోని సీతారాంపురం గ్రామానికి చెందిన లడె రాజేశ్వర్‌రావు పేరిట ఉన్న 1,173 చదరపు గజాల స్థలం ఉంది. దాన్ని నాలుగు భాగాలుగా గిఫ్ట్ డీడ్ చేసుకునేందుకు ఆయన కుమారులు శ్రీనివాస్, శ్రీకాంత్‌లు స్థానిక దస్తావేజు లేఖరి బొట్ల నరేశ్ ద్వారా పరకాల సబ్‌రిజిస్ట్రార్ సునీతను కలవగా రూ.80 వేల లంచం ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. దీంతో శ్రీనివాస్ ఈ నెల 22న హనుమకొండ ఏసీబీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. రిజిస్ట్రేషన్ అనంతరం గురువారం శ్రీనివాస్, శ్రీకాంత్‌లు రూ.80 వేలను మధ్యవర్తి నరేశ్‌కు ఇవ్వగా అక్కడే కాపు కాసిన ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. నిందితులిద్దరినీ అరెస్టు చేశామని శుక్రవారం హనుమకొండ ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని అనిశా డీఎస్పీ సాంబయ్య వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఓ ఎస్సై లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖకు పట్టుబడ్డాడు. ఖమ్మం అనిశా డీఎస్పీ వై.రమేష్ కథనం ప్రకారం.. పాల్వంచ బొల్లోరిగూడేనికి చెందిన శీరపు శ్రావణి వద్ద అదే ప్రాంతానికి చెందిన బాలసాని గణెళిశ్ గౌడ్ రూ.30 లక్షల అప్పు తీసుకున్నాడు. ఆ అప్పు తీర్చకుండా గణెళిశ్, అతని కుటుంబీకులు బెదిరిస్తున్నారని శ్రావణి పాల్వంచ పట్టణ ఎస్సై బాణాల రాముకు ఫిర్యాదు చేయగా ఈ నెల 12న ఎఫ్ఐఆర్ నమోదు చేసి, ఛార్జిషీట్ దాఖలుకు రూ.20 వేల లంచం అడిగాడు. కేసు పరిష్కారం అయ్యాక మరికొంత ముట్టజెప్పాలని డిమాండ్ చేశాడు. దీంతో బాధితురాలు అనిశాకు ఫిర్యాదు చేశారు. శ్రావణి తరఫు న్యాయవాది నుంచి ఎస్సై రాము గురువారం మధ్యాహ్నం రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా కాపు కాసిన అనిశా అధికారులు పట్టుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు డీఎస్పీ తెలిపారు.

# జీవో 317 వల్ల నష్టపోయిన ఉద్యోగులను గుర్తించండి

## వారి వివరాలను వెంటనే అందిండి: దామోదర రాజనర్సింహ

హైదరాబాద్,జూలై 26 : జీవో 317 వల్ల నష్టపోయిన ఉద్యోగులను గుర్తించి వారి వివరాలను వీలైనంత త్వరగా ఇవ్వాలని అధికారులను మంత్రివర్గ ఉపసంఘం ఆదేశించింది. జీవో 317పై సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘం ఛైర్మన్ దామోదర రాజనర్సింహ అధ్యక్షతన సభ్యులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. తాజాగా మరికొన్ని శాఖల నివేదికలు సమర్పించగా.. మరిన్ని విభాగాల నుంచి పూర్తి వివరాలు అందలేదని కేబినెట్ సబ్ కమిటీ తెలిపింది. వెబ్‌సైట్ ద్వారా అందిన దరఖాస్తుల్లో సుమారు 30 నుంచి 40శాతం పునరావృతమైనట్టు కమిటీ గుర్తించింది. అన్యాయం జరిగిన వారికి న్యాయం చేయాలన్న ప్రభుత్వ ప్రయత్నాలను ఉపయోగించుకొని కొందరు సొంత జిల్లాలకు వెళ్లేందుకు తప్పుడు ప్రయత్నాలు చేస్తున్నట్టు అధికారులు కమిటీ దృష్టికి తెచ్చారు. నష్టపోయిన వారి వివరాలు మాత్రమే గుర్తించి నివేదిక ఇవ్వాలని అధికారులకు సబ్ కమిటీ స్పష్టం చేసింది. సమావేశంలో వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులు, కమిషనర్లు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అదుపుతప్పి బస్సును ఢీకొన్న కారు

## ప్రమాదంలో ఇద్దరు మృతి

హైదరాబాద్,జూలై2 6 : రాజీవ్ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. ద్విచక్రవాహ నాన్ని తప్పించబోయి అదుపుతప్పిన ఓ కారు డివైడర్ దాటి అవతలివైపు మార్గంలో వెళ్తున్న బస్సును ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులో ఉన్న ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. బస్సులో ఉన్న పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. శామీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట వైపు నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఇన్నోవా కారు మేడ్చల్ జిల్లా శామీర్‌పేట్ పోలీసు స్టేషన్ పరిధిలోని తుర్కపల్లి, మజ్జీద్‌పూర్ గ్రామాల మధ్య ప్రమాదానికి గురైంది. మృతుల వివరాలు ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనతో ట్రాఫిక్ కిలోమీటరు మేర స్తంభించింది.

# అన్ని వర్గాల ప్రజల సంక్షేమంగా బడ్జెట్

ఆదిలాబాద్,జూలై 26 : అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం రూ.2.91 లక్షల కోట్లతో బడ్జెట్ ను ప్రవేశపెట్టిందని డీసీసీబీ ఛైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భాజపా, భారాస నాయకులు బ్జడెట్ పై విమర్శలు చేయడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బ్జడెట్ లో రాష్ట్రానికి ఏమి ఇచ్చిందని ప్రశ్నించారు. గతంలో భారాస ప్రభుత్వం అన్ని సగం సగం పనులే చేసిందని విమర్శించారు. సమావేశంలో పార్టీ నాయకులు లోక ప్రవీణ్ రెడ్డి, గిమ్మ సంతోష్, బండారి సతీష్, రాంకుమార్, భూమన్న, సుఖేందర్ తదితరులు పాల్గొన్నారు.

# షిర్డీ రైల్లో దొంగల దోపిడీ

## దర్యాప్తు చేపట్టిన రైల్వే పోలీసులు

హైదరాబాద్,జూలై 26 : షిర్డీ నుంచి కాకినాడ వెళ్తున్న రైలులో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. మూడు బోగీల్లో దుండగులు దోపిడీకి పాల్పడ్డారు. కాకినాడ వెళ్తున్న ప్రయాణికుల వస్తువులను చోరీ చేశారు. మహారాష్ట్రలోని లాతూరు రోడ్ జంక్షన్‌లో ప్రయాణికులు గుర్తించి ఆందోళనకు దిగారు. మూడు బోగీల్లోనూ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రయాణికులే ఉన్నారు. వీరంతా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకుని రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రయాణికుల నుంచి రూ.30 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్లు, డైమండ్ ఉంగరాలు అపహరణకు గురయ్యాయి. ఈ ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దొంగలు ప్రయాణికుల్లా బోగీల్లోకి వచ్చి అర్ధరాత్రి ప్రయాణికులు నిద్రలోకి జారుకున్నాక దోపిడీకి పాల్పడ్డారు.

# డివైడర్లపై ఫ్లెక్సీలు తొలగించాలి

## డ్రెయిన్లలో పూడికలు తీయండి

## అధికారులకు మంత్రి నారాయణ ఆదేశాలు

అమరావతి,జూలై 26 : కార్పొరేషన్ల పరిధిలో రోడ్డు డివైడర్లపై ఉండే ఫ్లెక్సీలను తక్షణమే తొలగించాలని ఏపీ పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. సచివాలయంలో రాష్ట్రంలోని 8 మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్లతో మంత్రి సమావేశమయ్యారు. ఆయా కార్పొరేషన్లలో చేపట్టాల్సి అభివృద్ధి కార్యక్రమాలు, టిడ్కో ఇళ్లపై చర్చించారు. నగరాల్లో పార్కులు, సెంట్రల్ డివైడర్లు, రోడ్ల గుంతలు, డ్రెయిన్లలో పూడిక తొలగింపుపై దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. రోడ్లపై సెంట్రల్ డివైడర్లలో ఎలాంటి ఫ్లెక్సీలున్నా వెంటనే తొలగించాలని ఆదేశించారు. వాటి వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వానాకాలం నేపథ్యంలో డయేరియా వంటి అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని, టిడ్కో ఇళ్లు, అన్న క్యాంటీన్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని కమిషనర్లకు మంత్రి సూచించారు. టౌన్‌ఎ÷-లానింగ్‌పై ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా చూడాలని స్పష్టం చేశారు.

# టీచర్, పట్టభద్ర ఎమ్మెల్సీ ఓట్ల నమోదు

## ప్రకటన జారీచేసిన ఎన్నికల సంఘం

అమరావతి,జూలై 26 : తూర్పు- పశ్చిమ గోదావరి జిల్లా ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి తాజా ఓటర్ల జాబితా రూపకల్పనకు ఎన్నికల సంఘం ప్రకటన జారీ చేసింది. ఈసీ ఆదేశాలమేరకు 2024 నవంబరు 1 నాటికి జాబితా రూపొందించేలా షెడ్యూలు విడుదల చేయాలని నిర్ణయించినట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వివేక్ యాదవ్ తెలిపారు. ఈ నెల 29న ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి ఓటర్ల రిజిస్ట్రేషన్‌కు ఈసీ.. నోటీసు విడుదల చేయనుంది. శ్రీకాకుళం-విజయనగరం-విశాఖ ఉపాధ్యాయ నియోజకవర్గానికి, కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఓటర్ల జాబితాలో పేర్ల నమోదుకు 2024 సెప్టెంబరు 30న ఎన్నికల సంఘం నోటీసు జారీ చేయనుంది. 2024 డిసెంబరు 30 నాటికి తుది ఓటర్ల జాబితా రూపొందిస్తామని సీఈవో కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది.

# కాళేశ్వరం వ్యయం అడ్డగోలుగా పెంచారు

**మేడిగడ్డ పంపింగ్‌తో భారీ నష్టం జరిగే ప్రమాదం**

**పూర్తి స్థాయిలో రన్ చేస్తే కరెంటు బిల్లే రూ.10వేల కోట్లు**

**కొట్టుకుపోతే భద్రాచలం సహా 44 గ్రామాలు మునక**

**రూ.94 వేల కోట్లు ఖర్చుతో కేవలం 93 వేల ఎకరాల ఆయకట్టు**

**చేసిన తప్పిదాలకు కెసిఆర్, కెటిఆర్‌లు క్షమాపణలు చెప్పాలి**

**నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్**

హైదరాబాద్,జూలై 26 : కమీషన్లకు కక్కుర్తిపడి కెసిఆర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు నిలిపేశారని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. అలాగే కాళేశ్వరం ప్రాజెక్టు వ్యయం రూ.38,500 కోట్ల నుంచి రూ.80వేల కోట్లకు పెంచారని అన్నారు. కాగ్ లెక్కల ప్రకారం ఆ ప్రాజెక్టు పూర్తి కావాలంటే రూ.1.47లక్షల కోట్లు కావాలి. కాళేశ్వరం ప్రాజెక్టు రన్నింగ్ కాస్ట్ కూడా చాలా ఎక్కువ. ప్రాజెక్టులోని అన్ని పంపులను పూర్తి స్థాయిలో రన్ చేస్తే కరెంటు బిల్లే రూ.10వేల కోట్లు అవుతుంది. ప్రాజెక్టు పూర్తయి అన్ని మోటార్లు రన్ చేస్తే ఈ వ్యయం ఇంకా పెరిగే అవకాశముంది. ఈ ప్రాజెక్టు కోసం అధిక వడ్డీతో రుణాలు తీసుకున్నారు. ఏడాదికి కాళేశ్వరంపై రూ.15వేలకోట్లు ఖర్చు చేయాల్సి వస్తుంది. దాదాపు రూ.94 వేల కోట్లు ఖర్చు చేస్తే కాళేశ్వరం కింద కేవలం 93 వేల ఎకరాలు మాత్రమే కొత్త ఆయకట్టు సాగులోకి వచ్చిందని అన్నారు. హైదరాబాద్ జలసౌధలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మేడిగడ్డపై కాంగ్రెస్ కుట్ర చేసిందని భారాస ఆరోపిస్తోంది. మేడిగడ్డ మొదలుపెట్టినప్పుడు, కూలినప్పుడు కూడా భారాస ప్రభుత్వమే అధికారంలో ఉంది. మేడిగడ్డలో పిల్లర్లు 6 అడుగులు లోపలికి కుంగాయి. నాసిరకంగా నిర్మించడం వల్లే బ్యారేజీ కుగిందని ఎన్డీఎస్‌ఏ స్పష్టం చేసింది. ఎన్డీఎస్‌ఏ నివేదికపైనా భారాస ఆరోపణలు చేస్తోంది. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీని కేంద్ర చట్టం ద్వారా ఏర్పాటు చేశారు. అక్టోబరు 21న బ్యారేజీ కుగింది.. మా ప్రభుత్వం ఏర్పడింది డిసెంబరులో. మేడిగడ్డ వద్ద ఎవరో బాంబులు పెట్టినట్టు ఎఫ్‌ఐఆర్ కూడా ÷ల్ చేశారు. బ్యారేజీ కుంగినా కేసీఆర్ నోరు మెదపలేదు. ఎన్డీఎస్‌ఏ సలహా, సూచనల మేరకే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీ గేట్లు తెరిచాం. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి రెండ్రోజుల్లో పంపింగ్ ప్రారంభిస్తాం. ఎల్లంపల్లి నుంచి పంపింగ్ మొదలుపెట్టి మిడ్ మానేరుకు నీటిని తరలిస్తామన్నారు. మేడిగడ్డ బ్యారేజీలో పూర్తి సామర్థ్యంతో పంపింగ్ చేయాలని భారాస చెబుతోంది. ఏదైనా ప్రమాదం జరిగితే మేడిగడ్డ సమీపంలోని 44 గ్రామాలు కొట్టుకుపోతాయి. భద్రాచలం కూడా పూర్తిగా కొట్టుకుపోతుంది. మేడిగడ్డ కుంగినప్పుడు భారాస ప్రభుత్వమే నీళ్లను కిందకు వదిలింది. ఇప్పుడేమో మేడిగడ్డ నుంచి నీళ్లు పంపింగ్ చేయాలని కోరుతోంది. డీపీఆర్‌లోని అంశాలను గత భారాస ప్రభుత్వం పట్టించుకోలేదు. సెంట్రల్ డిజైన్ సంస్థ ప్రకారం నిర్మాణం జరగలేదు. ఒక వ్యక్తి ఆలోచనల ప్రకారం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారు. స్వతంత్ర భారత చరిత్రలో ఇంత ఘోర తప్పిదం ఎవరూ చేసి ఉండరని, అందుకు ప్రజలకు కేసీఆర్, కేటీఆర్ క్షమాపణ చెప్పాలని అన్నారు. ప్రాజెక్టుల పేరుతో భారాస నేతలు విహార యాత్ర చేస్తున్నారని ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం అధిక వడ్డీతో మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు రుణాలు తీసుకున్నారని ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. ప్రాజెక్ట్‌ల విషయంలో గత కొన్ని రోజులుగా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య పెద్ద మాటల యుద్ధమే నడుస్తోంది. ఓ వైపు మీడియా ముందుకొచ్చి బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతుంటే.. ఇందుకు కౌంటర్‌గా మంత్రులు మీడియా, సోషల్ మీడియా వేదికగా ఓ రేంజ్‌లో ఇచ్చిపడేస్తున్నారు. తాజాగా కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై శుక్రవారం మంత్రి ఉత్తమ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కాళేశ్వరం వ్యయం రూ.38,500 కోట్ల నుంచి రూ.80 వేల కోట్లకు పెంచారని మండిపడ్డారు. కాగ్ ప్రకారం కాళేశ్వరం పూర్తి కావాలంటే రూ.1.47 లక్షల కోట్లు కావాలని స్పష్టం చేశారు. ప్రాజెక్టు రన్నింగ్ కాస్ట్ కూడా చాలా ఎక్కువని తెలిపారు. 93 వేల ఎకరాల ఆయకట్టు కోసం రూ.94 వేల కోట్లు ఖర్చే చేశారని అన్నారు. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇరిగేషన్‌కు రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు పెట్టారన్నారు. ఎక్కువ ఖర్చయితే.. ఎక్కువ కమిషన్లు వస్తాయని ఇలా చేశారని విమర్శించారు. ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టును నిలిపేశారని మంత్రి ఉత్తమ్ ఫైర్ అయ్యారు. అక్టోబర్ 21వ తేదీన బ్యారేజీ కుంగిందని.. .కాంగ్రెస్ డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చిందని గుర్తుచేశారు. మేడిగడ్డ దగ్గర ఎవరో బాంబులు పెట్టినట్లు కేసు ఫైల్ చేశారని చెప్పారు. బ్యారేజీ కుంగినా మాజీ సీఎం కేసీఆర్ నోరు మెదపలేదని మండిపడ్డారు. ఎన్డీఎస్‌ఏ సలహా మేరకు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల గేట్లు తెరిచామని వివరించారు. మేడిగడ్డ కుంగినప్పుడు గత ప్రభుత్వమే నీళ్లను వదిలిందని తెలిపారు. డీపీఆర్‌లోని అంశాలను గత కేసీఆర్ ప్రభుత్వం ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. తప్పులు చేసినందుకు ప్రజలకు బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, కేటీఆర్ క్షమాపణలు చెప్పాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు.

# హైదరాబాద్ సమగ్రాభివృద్ధికి అడుగులు



హైదరాబాద్ సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం కావాల్సి ఉంది. ప్రధానంగా మురుగునీరు, చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు,ట్రాఫిక్ సమస్యలు ఎప్పటినుంచో వేధిస్తున్నాయి. నగరంలో చెత్తను ఎక్కడపడితే అక్కడ వేసేస్తున్నారు. ఈ విషయంలో కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. చెత్తను వీధుల్లో ఎక్కడ పడితే అక్కడ పడేసే విధానాలకు స్వస్తి పలకాలి. అవసరమైతే జరిమానాలు విధించాలి. దీనికితోడు నగరంలో రోడ్లపై వెలసిన ఆలయాలు, దర్గాలు, ఇతర కట్టడాల తొలగింపుపై కఠిన చర్యలకు ఉపక్రమించాలి. లేకుంటే అవి రోడ్లకు అడ్డంగా ఉండడం వల్ల ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయి. హైదరాబాద్‌తో అనుబంధం ఉన్న వారిని, రాజకీయ పార్టీలను కూర్చోబెట్టి ఈ సమస్యలపై చర్చించాలి. రోడ్డు మధ్యలో ఉన్న ప్రార్థనా స్థలాలు, దర్గాల తొలగింపు అనివార్యం కావాలి. నగర సుందరీకరణలో వీటి తొలగింపు అత్యంత ముఖ్యం. అలాగే నాలాల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపాలి. డ్రైనేజీ వ్యవస్థను పటిష్టం చేసుకోవాలి. వర్షం వస్తే కాలనీలు మునిగే పరిస్థితి రాకుండా చూసుకోవాలి. ఈ క్రమంలో బడ్జెట్ ప్రతిపాదనలను చూశాక హైదరాబాద్ రూపురేఖలు మారబోతున్నాయి. ఇప్పటికే శివారు ప్రాంతాలు బాగా అభివృద్ధి చెందాయి. తెలంగాణకు మణిహారమైన హైదరాబాద్ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో నగర అభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించారు. శంషాబాద్ విమానాశ్రయం వరకూ మెట్రో విస్తరణకు రూ.100 కోట్లు, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుకు రూ.1500 కోట్లు, రీజనల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టుకు రూ.1,525 కోట్లు, ఔటర్ రింగ్ రోడ్డుకు రూ.200 కోట్లు, హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు రూ.500 కోట్లు, హైడ్రా సంస్థకు రూ.200 కోట్లు, మెట్రో వాటర్ వర్క్స్‌కు రూ.3,385 కోట్లు కేటాయించారు. నగరంలో పారిశుద్ధ్య, మురుగు, నీటి, తాగునీటి సమస్యలు గత పదేళ్లుగా నిర్లక్ష్యానికి గురైనట్లు భట్టి విమర్శించారు. భాగ్యనగరాన్ని మరింత ప్రణాళికా బద్ధంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈ కేటాయింపులు ఇంతగా గతంలో ఎప్పుడూ జరగలేదు. దీనికితోడు మెట్రో విస్తరణ, మూసీ సుందరీకరణతో నగర రూపురేఖలు మారుతాయి. పట్టణ విపత్తుల నివారణకు, వాటిని ఎదుర్కొన డానికి తీసుకోవాల్సిన చర్యలను చేపట్టడంతో పాటు, ఎలాంటి విపత్కర పరిస్థితినైనా ఎదుర్కొని తక్షణ రక్షణ చర్యలు తీసుకొనే విషయంలో జాతీయ, రాష్ట్రేతర సంస్థలతో సమన్వయాన్ని చేస్తుంది. ఈ సంస్థలో ఆస్తుల పరిరక్షణకు, విపత్తుల నిర్వహణకు ప్రత్యేక విభాగాలు ఉంటాయి. బడ్జెట్‌లో హైడ్రా సంస్థకు రూ.200 కోట్లు కేటాయించారు. దీంతో ఇప్పుడు హైడ్రా తన పనిని వేగంగా చురుకుగా చేపట్టడానికి వీలవుతుంది. అలాగే అన్యక్రాంతం అయిన భూములను పరిరక్షించేందుకు వీలవుతుంది. ఇకపోతే ప్రధానంగా నగరంలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉంది. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో పాటు శివారు ప్రాంతాలు విస్తరించి, నగరంలో కలిసి పోవడం, పట్టణీకరణ విషయంలో క్రమపద్ధతి లేకపోవడంతో నగరం నరకకూపంగా మారుతోంది. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా సుమారు 110 చదరపు కి.మీల పట్టణ ప్రాంతం పునరుజ్జీవనం చెందుతుంది. అలాగే, నదీ తీర ప్రాంతంలో క్రొత్త వాణిజ్య, నివాస కేంద్రాలు వెలిసి, పాత హెరిటేజ్ ప్రాంతాలు క్రొత్తదనాన్ని సంతరించుకుంటాయి. ఈ ప్రాజెక్టు కోసం బడ్జెట్‌లో రూ.1500 కోట్లు ప్రతిపాదించడం ఆహ్వానించదగ్గ పరిణామంగా చూడాలి. ఇకపోతే జిహెచ్‌ఎంసి పరిధిలో మౌలిక వసతుల కల్పనకు రూ.3,065 కోట్లు కేటాయింపు కూడా కలసి రానుంది. ఎయిర్ పోర్ట్ వరకూ మెట్రో విస్తరణకు రూ.100 కోట్లు, ఓఆర్ఆర్‌కు రూ.200 కోట్లు, హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు రూ.500 కోట్లు, పాత నగరానికి మెట్రో విస్తరణకు రూ.500 కోట్లు, మల్టీ మోడల్ సబర్బన్ రైలు ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్‌కు రూ.50 కోట్లు కేటాయింపు జరిగింది. ఇవన్నీ కూడా ట్రాఫిక్‌ను కంట్రోల్ చేసేవే. ఇకపోతే నగరంలో విలువైన భూములు అన్యాక్రాంతం అయినా గత పదేళ్లుగా పట్టింపు లేకుండా పోయింది. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్‌లోని ప్రభుత్వ భూములు ఏ విధంగానైతే అన్యాక్రాంతమయ్యాయో, స్వరాష్ట్రంలో దానికి రెట్టింపు భూ విధ్వంసం జరిగింది. అనాటి గొలుసుకట్టు చెరువులు చాలా మాయం చేసి, కొండలు, గుట్టలను పిండి చేసి రియల్ ఎస్టేట్ ప్లాట్లుగా మార్చేసి అమ్మేశారు. గత ప్రభుత్వం క్షేత్రస్థాయిలో ప్రభుత్వ భూములకు రక్షణగా ఉండే వీఆర్‌ఓ, వీఆర్‌ఏలను రెవెన్యూశాఖ నుంచి దూరం చేయడంతో కబ్జాలకు ప్రభుత్వమే ఉసిగొలిపినట్ట య్యింది. అధికార అండతో విలువైన భూములను కాజేశారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్‌లో జరిగిన భూ విధ్వంసంపై దృష్టి పెట్టింది. ప్రభుత్వ భూములను, చెరువులను కాపాడేందుకు సీఎం రేవంత్ రెడ్డి సరికొత్త ఆలోచన చేసి, హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ ప్రొటెక్షన్ హైడ్రా అనే ఓ ప్రత్యేక విభాగాన్నే ఏర్పాటు చేశారు. బడ్జెట్‌లో 'హైడ్రా'కు 200 కోట్ల రూపాయల కేటాయింపు ప్రభుత్వ సంకల్ప శుద్ధికి నిదర్శనం. జీహెచ్‌ఎంసీ పరిధిని ఔటర్ రింగు రోడ్డు వరకు విస్తరిం చేందుకు సీఎం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నందున, జీహెచ్‌ఎంసీతో పాటు ఔటర్ వరకు ఉన్న ప్రాంతాలు హైడ్రా పరిధిలోకి రానున్నాయి. సుమారు 2 వేల చదరపు కిలోమీటర్లు, 27 మునిసిపాలిటీలు, 33 పంచాయ తీలను కలుపుకొని స్వయం ప్రతిపత్తితో ఉండేలా హైడ్రాను అందుబాటులోకి తెచ్చారు. చెరువుల కబ్జాలకు అడ్డుకట్ట వేయడం, ప్రభుత్వ స్థలాల పరిరక్షించడం, అక్రమ నిర్మాణాలను నియంత్రించడంలో ప్రధాన భూమికను పోషించనుంది. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణతో పాటు విపత్తుల నిర్వహణలోనూ అది కీలకం. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ పరిధిలో వేలాది ఎకరాల ప్రభుత్వ, చెరువు, వక్ఫ్, దేవాదాయశాఖ, పార్కులు, ఇనాం భూములు కబ్జాదారుల చెరల్లో ఉన్న విషయం తెలిసిందే. గత కొన్నేళ్లుగా ఈ ఆక్రమణలపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఇంకా చెరువులు, కుంటలు, నాలాలు, ప్రభుత్వ భూములు కబ్జాల పాలవుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో కబ్జాదారుల బారి నుంచి సర్కారు భూములకు విముక్తి కల్పించడంతోపాటు ఇకముందు ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా నిరోధించడం కోసం సరికొత్తగా రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను అందుబాటులోకి తెచ్చింది. భూముల ధరలకు రెక్కలు రావడంతో రాత్రికి రాత్రే మట్టిపోస్తూ చెరువులను నామరూపం లేకుండా పూడ్చేస్తున్నారు. ఈ నేపథ్యంలో చెరువులు, కుంటల కబ్జాలపై వచ్చే ఫిర్యాదుల మీద హైడ్రా తక్షణమే స్పందిస్తుంది. హైదరాబాద్ నగరంలో శాటిలైట్ ఉపగ్రహ ఛాయాచిత్రాలతో ప్రభుత్వ రికార్డులను ఆధారంగా చేసుకొని హైడ్రా అధికారులు నీటిపారుదల, రెవెన్యూ, ఇంజినీరింగ్, టౌన్ ఎ÷-లానింగ్ అధికారులతో కలిసి సర్వే చేసి ఆక్రమిత భూముల వివరాలను వెలికితీసి, అక్రమ నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. నగరంతో పాటు నగర శివారు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గించేలా పోలీసులతో సమన్వయం చేసుకుంటారు. ప్రధాన రహదారుల పక్కన ఫుట్‌పాత్‌లపై శాశ్వత ఆక్రమణల తొలగింపుపై ప్రత్యేక దృష్టిసారించనున్నారు. వరద నిర్వహణకు జీహెచ్‌ఎంసీ, వాటర్ బోర్డు, ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేసిన బృందాల పని తీరును క్షేత్రస్థాయిలో పర్యవేక్షించనున్నారు. ఇలా, నిర్దిష్టమైన బృహత్ లక్ష్యాలతో ఆవిర్భవించిన 'హైదరాబాద్ విపత్తు స్పందన, ఆస్తుల పరిరక్షణ ప్రాధికార సంస్థ హైడ్రా పనితీరుతో నగర రూపురేఖలు మారనున్నాయి.

# రాష్ట్ర అప్పులపై సీఎం చంద్రబాబు అబద్దాలు

**తప్పుడు ప్రచారాలతో తప్పదోవ పట్టించే ప్రయత్నం**

**52 రోజులుగా దాడులు, అత్యాచారాలు, ఆస్తుల ధ్వంసం**

**లెక్కలు చూపాల్సి వస్తుందనే బడ్జెట్ పెట్టడం లేదు**

**శ్వేత పత్రాలతో మభ్య పెట్టే యత్నం**

**మీడియా సమావేశంలో మాజీ సీఎం జగన్**

అమరావతి,జూలై 26 : రాష్ట్ర అప్పులపై సీఎం చంద్రబాబు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ ఆరోపించారు. శుక్రవారం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు పాలనలో రాష్ట్రం తిరోమనంలో వెళ్తోందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 52 రోజుల్లో రాష్ట్రంలో అక్రమాలు, ఆకృత్యాలు పెరిగిపోయాయని ఆరోపణలు గుప్పించారు. ప్రశ్నించే వాళ్లను అణచివేస్తున్నారు. వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. విధ్వంస పాలన సాగుతుంటే పోలీసులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు. బడ్జెట్ కూడా పెట్టలేని స్థితిలో చంద్రబాబు ప్రభుత్వం ఉంది. పూర్తి స్థాయి బడ్జెట్ పెడితే బాబు హామీలకు లెక్కలు చూపాల్సి వస్తుంది. అందుకే బడ్జెట్ ప్రవేశపెట్టడానికి వెనకడుగేస్తున్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అంధకారంలోకి వెళ్లిందని అబద్దాలు ప్రచారం చేస్తున్నారు. బాబు పాలనలోనే రాష్ట్రం ఆర్థికంగా దిగజారిందని జగన్ అన్నారు. ఎన్నికల సమయంలో 14 లక్షల కోట్ల అప్పులు ఉన్నాయని చెబుతూ.. సూపర్ సిక్స్ హామీలు జగన్ విమర్శించారు. 'ఇప్పుడు అధికారం వచ్చాక అది చూపించడానికి ఇబ్బందులు పడుతున్నారు. గవర్నర్ ప్రసంగంలో రూ.10 లక్షల కోట్ల అప్పు అయ్యిందని చూపించారు. శ్వేత పత్రాలతో మభ్య పెట్టే యత్నం చేస్తున్నారు. ఆర్బీఐ, కాగ్, రాష్ట్ర బ్జడెట్ లెక్కల ప్రకారం 2024 జూన్ వరకు కూటమి సర్కార్ గద్దెనెక్కేవరకు రూ.5 లక్షల 18 వేల కోట్ల అప్పు మాత్రమే అయింది. చంద్రబాబు హయాంలో 21.63 శాతం దాకా అప్పు చేశారు. వైసీపీ హయాంలో 12.9 శాతం అప్పు చేశాం. కేంద్ర ఆర్థిక సర్వే మా ప్రభుత్వ పని తీరును మెచ్చుకుంది. బ్జడెట్‌లోనూ ఈ లెక్కలన్నీ చెప్పాల్సి వస్తుందనే పూర్తిస్థాయి బడ్జెట్ పెట్టడం లేదు. 14 లక్షల కోట్ల అప్పు ఉందని చెప్పడం సరికాదు' అని జగన్ అన్నారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రం ఎటు వైపు వెళ్తుందో ఆలోచించాలని, పురోగతి వైపు వెళ్తుందా?.. తిరోగమనంలో వెళ్తోందా? గమనించాలని ఏపీ ప్రజలకు జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు ఇచ్చారు. రాష్ట్రంలో కొనసాగుతున్న అరాచకాలు, చంద్రబాబు విడుదల చేస్తున్న అబద్ధపు శ్వేత పత్రాలు, వైఎస్సార్‌సీపీ హయాంపై చేస్తున్న తప్పుడు ప్రచారాలపై తాడేపల్లిలోని తన కార్యాలయంలో జగన్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో గత 52 రోజులుగా దాడులు, అత్యాచారాలు, ఆస్తుల ధ్వంసం కొనసాగుతోంది. ప్రశ్నించే వాళ్లను అణచివేసే ధోరణితో పాలన ముందుకు సాగుతోంది. విధ్వంస పాలన కొనసాగుతుంటే.. పోలీసులు పూర్తిగా ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు. చంద్రబాబు ప్రభుత్వం ఏడు నెలల ఓటాన్ బ్జడెట్ పెడుతోంది. పూర్తిస్థాయి బ్జడెట్ పెట్టే ధైర్యం లేంటే ఎంతటి దారుణమైన, అధ్వానమైన పాలనో అర్థం చేసుకోవాలి. ఫుల్ బ్జడెట్ పెడితే చంద్రబాబు నాయుడు మోసపూరిత హామీలు ఏమైతే ఇచ్చారో.. వాటికి కేటాయింపులు చూపించాల్సిన అవసరం వస్తుంది. అందుకే ఆ పని చేయడం లేదు. చంద్రబాబు 2019లో దిగిపోయే నాటికి రూ.2 లక్షల 72 వేల కోట్ల అప్పు ఉంది. వైఎస్సార్‌సీపీ హయాంలో ఆ అప్పు రూ.5 లక్షల 18 వేల కోట్లకు చేరింది. గ్యారెంటీలు, విద్యుత్ ఒప్పందాలు కలిపినా రూ. 7లక్షల 48 వేల కోట్లు మాత్రమే. అయినా గవర్నర్ ప్రసంగంలో అబద్ధం చెప్పించారు. ఇలా రూ. 14 లక్షల కోట్ల అప్పు ఉందని చెప్పడం ధర్మమా?. వాస్తవాలపై గవర్నర్‌కు లేఖ రాస్తాం. ఆయనతోనూ అబద్దాలు చెప్పించిన విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్తాం. చంద్రబాబు అధికారం చేపట్టేనాటికి రూ.7 వేల కోట్లకు పైగా ఖజానా సొమ్ము ఉంది. కానీ, మేం అధికారం చేపట్టేనాటికి రూ.100 కోట్లే ఉంది. ఆ విషయాన్ని ఈనాడు కూడా రాసింది. మేం అధికారంలో ఉండగా మేనిఫెస్టోలో ప్రతీ హామీని అమలు చేశాం. డీబీటీ ద్వారా బటన్ నొక్కి రూ.2.71 లక్షల కోట్లు లబ్ధిదారులకు జమ చేశాం. పార్టీ, ప్రాంతాలు కూడా చూడకుండా అందరికీ సంక్షేమం అందించాం. చంద్రబాబు హయాంలో 21.63 శాతం దాకా అప్పు చేశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో 12.9 శాతం అప్పు చేశాం. కేంద్ర ఎకనామిక్ సర్వే మా ప్రభుత్వ పని తీరును మెచ్చుకుంది. అయినా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆగమైనట్లు చిత్రీకరించడం ఎంత వరకు సమంజసం?. బ్జడెట్‌లోనూ ఈ లెక్కలన్నీ చెప్పాల్సి వస్తుందనే పూర్తిస్థాయి బ్జడెట్ పెట్టడం లేదు. అసలు లేని రూ.14 లక్షల కోట్ల అప్పు ఉందని చెప్పడం ధర్మమా?. చంద్రబాబు హయాంలో 21.63 శాతం దాకా అప్పు చేశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో 12.9 శాతం అప్పు చేశాం. కేంద్రం ఇచ్చిన అనుమతుల కన్నా తక్కువ అప్పే చేశాం. కోవిడ్ టైంలోనూ పూర్తి స్థాయి బ్జడెట్ పెట్టాం. ఆ టైంలో కేంద్రం నుంచి పన్నుల వాటా తగ్గింది. అయినా సంక్షేమం ఆపలేదు. ఈ లెక్కన ఎవరు ఆర్థికంగా ధ్వంసం చేసినట్లు? కేంద్ర ఎకనామిక్ సర్వే మా ప్రభుత్వ పని తీరును మెచ్చుకుంది. కేవలం.. బ్జడెట్‌లోనూ ఈ లెక్కలన్నీ చెప్పాల్సి వస్తుందనే చంద్రబాబు ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ పెట్టడం లేదన్నారు. 2019-24మధ్య రాష్ట్రంలో భారీగా జరిగిన ఆర్థిక నిర్వహణ లోపాలపై శ్వేతపత్రాన్ని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు నేడు సభ ముందు ఉంచారు. అయిదేళ్ల పాటు పట్టిసీమను ఆపరేట్ చేయలేదని వెల్లడించారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శనివారం 27 జూలై 2024



# ఆరంభ సంబరం పారిస్ పరవశం

**సెన్ నదిలో అలరించిన వేడుకలు**
**ఘనంగా ఒలింపిక్స్ ఆరంభం**
**తిలకించిన ప్రేక్షకులు 3,20,000**
**బోట్ల సంఖ్య 85**
**పాల్గొన్న అథ్లెట్లు 6800**
**పరేడ్ దూరం 6 కి.మీ**
**స్టాండ్స్‌ల సంఖ్య 124**



**ఒలింపిక్ గేమ్స్‌కు వందేళ్ల తర్వాత పారిస్ వినూత్న రీతిలో స్వాగతం పలికింది. ఆరంభ వేడుకలను స్టేడియంలో కాకుండా చరిత్రలో తొలిసారి బయట.. అదీ ఓ నదీ ప్రవాహంలో నిర్వహించి ప్రపంచాన్ని అబ్బురపరిచింది. ఓవైపు పారిస్ మధ్యలోని సెన్ నదిలో ఆయా దేశాల అథ్లెట్లంతా పడవల్లో పరేడ్ నిర్వహించగా.. మరోవైపు ఒడ్డున వందలాది కళాకారులు తమ నృత్య రీతులతో ఆకట్టుకున్నారు. అలాగే తమ సంస్కృతీ సంప్రదాయాలను, చరిత్రను సైతం ఆహుతుల ముందుంచారు. ఓవరాల్‌గా చిరుజల్లులలో తడుస్తూనే సాగిన ఈ వేడుకలతో పారిస్ ఓపెన్ ఎయిర్ థియేటర్‌గా మారిందనడంలో సందేహం లేదు..**

పారిస్: ప్రపంచ క్రీడాప్రేమికులంతా అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఒలింపిక్స్ క్రీడలకు సరికొత్త రీతిలో పారిస్ తెర లేపింది. అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య.. 'గేమ్స్ వైడ్ ఓపెన్' నినాదంతో ఆరు బయట సాగిన ఈ ఆరంభ వేడుకలు అందరికీ థ్రిల్‌ను పంచాయి. 205 దేశాల నుంచి 6,800 మంది అథ్లెట్లు ఈఫిల్ టవర్ వరకు ఆరు కిలోమీటర్ల మేర ప్రయాణించారు. ఇప్పటివరకు ఒలింపిక్ చరిత్రలో స్టేడియంలో కాకుండా బయట ఆరంభ వేడుకలను నిర్వహించడం ఇదే తొలిసారి. నది మధ్యలో ఉన్న చిన్న బ్రిడ్జిలపై ఏర్పాటు చేసిన స్టాండ్స్‌నుంచే కాకుండా పక్కన ఒడ్డున నుంచి మొత్తంగా 3,20,000 మంది ప్రత్యక్షంగా తిలకించారు. ఈ పరేడ్ రూట్‌లో నిర్వాహకులు 71 భారీ స్క్రీన్లను, వెయ్యి లౌడ్‌స్పీకర్లను ఏర్పాటు చేశారు.

**గ్రీస్ రాకతో ఆరంభం:**
భారత కాలమానం ప్రకారం రాత్రి 11 గంటలకు వేడుకలు ఆరంభమయ్యాయి. ముందుగా ఒలింపిక్ జన్మస్థానమైన గ్రీస్ జట్టు ఆటగాళ్ల బోటుపై రాకతో వేడుకలకు తెర లేచింది. ఆ తర్వాత 37 మందితో కూడిన శరణార్థుల జట్టు అనంతరం అల్ఫాబెట్స్ ప్రకారం అఫ్ఘానిస్థాన్‌తో ఆయా దేశాల జట్ల రాక ఆరంభమైంది. వీటి మధ్యలోనే నది ఒడ్డున ఏర్పాటు చేసిన వేదికపై అమెరికన్ సింగర్ లేడీ గాగా ఫ్రెంచ్ క్యాబరెట్ నృత్యంతో సాంస్కృతిక కార్యక్రమాలు ఆరంభమయ్యాయి. అటు ఆయా దేశాల అథ్లెట్లు బోట్లపై రావడం.. ఆ వెంటనే కాస్త విరామమిచ్చి అక్కడక్కడా ఏర్పాటు చేసిన వేదికలపై కళాకారులు తమ ప్రదర్శనతో ఆహుతులను ఆకట్టుకోవడం జరిగింది. చివరగా ఆతిథ్య జట్టు ఫ్రాన్స్ ఆటగాళ్లు వచ్చారు.

**భారత్ నుంచి 78 మంది...**
భారత్ నుంచి ప్రారంభోత్సవ కార్యక్రమంలో 78 మంది అథ్లెట్లు, సిబ్బంది పాల్గొన్నారు. వరుస క్రమంలో 84వ దేశంగా పరేడ్‌లో పాల్గొన్న మన దేశం తరఫున ఫ్లాగ్ బేరర్‌గా పీవీ సింధు, ఆచంట శరత్ కమల్ వ్యవహరించారు. ఇక వీరితో పాటు 11 క్రీడాంశాలకు చెందిన దీపికా కుమారి, లవ్లీనా, రోహన్ బోపన్న, నగాల్, మనికా బాత్రా తదిరులు పరేడ్‌లో కనిపించారు. అయితే శనివారమే పోటీలున్న ఇతర విభాగాల అథ్లెట్లు కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. హాకీ జట్టు నుంచి ముగ్గురు రిజర్వ్ ఆటగాళ్లు మాత్రం వేడుకల్లో పాల్గొన్నారు. ఇక ట్రాక్ అండ్ ఫీల్డ్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్ జట్లు ఇంకా పారిసకు చేరుకోలేదు. మరోవైపు భారత పురుష అథ్లెట్లు కుర్తా బుందీ, మహిళలు చీరలు ధరించగా వీటిని త్రివర్ణ పతాక రంగులతో రూపొందించారు.

**మనోళ్ల పతక వేట షురూ**
కోట్లాది భారతీయుల ఆశలను మోస్తూ.. ప్రఖ్యాత ఒలింపిక్స్ బరిలో నిలిచిన భారత అథ్లెట్లు నేటి నుంచి తమ పతకాల వేటను ఆరంభించనున్నారు. మొత్తంగా కనీసం పది పతకాలైనా సాధించాలనే పట్టుదలతో ఉన్న వేళ.. తొలి రోజున బ్యాడ్మింటన్, షూటింగ్, హాకీ, బాక్సింగ్ ఇలా పలు కీలక క్రీడాంశాల్లో పోటీలు జరుగబోతున్నాయి. గట్టిగా పట్టుబడితే వీటిలో మెడల్స్‌ను అందించగల స్టార్లకు కొదువలేదు. వీరిలో పీవీ సింధు, సాత్విక్-చిరాగ్, నిఖత్ జరీన్, లవ్లీనా, మను బాకర్, హాకీ జట్టుపై భారీ అంచనాలే ఉన్నాయి..

**'హ్యాట్రిక్' లక్ష్యంగా సింధు**
భారత్‌కు కచ్చితంగా పతకం దక్కే అవకాశం ఉన్న క్రీడ బ్యాడ్మింటన్. ఇప్పటికే 2012 నుంచి వరుసగా మూడు ఒలింపిక్స్‌లో దేశానికి పతకాలు దక్కాయి. ఇప్పుడు భారత్ నుంచి ఏడుగురు షట్లర్లు, నాలుగు విభాగాల్లో బరిలోకి దిగుతున్నారు. ఇందులో సింధు హ్యాట్రిక్ మెడల్ లక్ష్యంతో ఉంది. ఇటీవలి కాలంలో తన ప్రదర్శన మెరుగ్గా లేకపోయినా.. ఒలింపిక్స్‌లో చెలరేగే అలవాటును కొనసాగించాలనుకుంటోంది. మహిళల సింగిల్స్‌లో 13వ ర్యాంకర్ సింధుకు గ్రూప్ దశను దాటడం సులువే. ఇక పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టిలపై స్వర్ణ ఆశలున్నాయి. తొలి రోజు శనివారం పోటీల్లో పురుషుల సింగిల్స్‌లో కెవిన్ కార్డన్ (గ్వాటెమాల)తో లక్ష్య సేన్ ఆడనున్నాడు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ రోనన్ లాబర్-లుకాస్ కార్వీ (ఫ్రాన్స్)తో.. మహిళల డబుల్స్‌లో అశ్విని-త్రిషా జోడీ కిమ్ సో యీంగ్-కాంగ్ హీ యాంగ్ (కొరియా)తో తలపడనున్నారు.

**కివీసతో హాకీ పోరు**
గతమెంతో ఘనంగా ఉన్న భారత పురుషుల హాకీ మ్యాచ్ వరుసగా రెండో పతకమే లక్ష్యంగా ఉంది. ఇందులో భాగంగా నేడు న్యూజిలాండ్‌తో తమ ఆరంభ మ్యాచ్‌ను ఆడబోతోంది. పూల్ ఆఫ్ డెత్‌గా భావించే పూల్ 'బి'లో ఉన్న భారత్‌పై అంచనాలు మాత్రం భారీగానే ఉన్నాయి. 41 ఏళ్ల తర్వాత టోక్యో గేమ్స్‌లో పతకం సాధించిన ఈ జట్టుకు దారి క్లిష్టంగానే ఉంది. తమ పూల్‌లోనే ఉన్న ప్రస్తుత చాంపియన్ బెల్జియం, ఆసీస్, అర్జెంటీనా, కివీస్, ఐర్లాండ్‌లతో గట్టి పోటీ ఉండనుంది. అందుకే తొలి మూడు మ్యాచ్‌లను గెలిస్తే నాకౌట్‌కు వెళ్లవచ్చు. చివరి రెండింటిని బెల్జియం, ఆసీసలతో ఆడాల్సి ఉంటుంది. కీపర్ శ్రీజేషకు చివరి గేమ్స్ కాబోతున్నాయి. కెప్టెన్ హర్మన్‌ప్రీత్, సుఖ్‌జీత్, రాజ్‌కుమార్, జర్మన్‌ప్రీత్‌లతో సమతూకంగా కనిపిస్తోంది.

**'నిఖత్, లవ్లీనాకు కఠిన డ్రా**
భారత్ నుంచి ఆరుగురు బాక్సర్లు బరిలోకి దిగనుండగా.. అందరి దృష్టి తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్, లవ్లీనా బొర్గొహెయిన్‌లపైనే ఉంది. అయితే ఈ ఇద్దరికీ కఠిన డ్రా ఎదురైంది. తొలిసారి 50కేజీ విభాగంలో పాల్గొంటున్న నిఖత్ తొలి పోరులో జర్మనీ సంచలనం కరీనా క్లొయెట్జర్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. సోమవారం ఈ బౌట్ జరుగనుంది. ఒకవేళ ఇది గెలిస్తే టాప్ ర్యాంకర్ వూ యూ (చైనా)తో సవాల్ ఎదురుకానుంది. ఇక టోక్యోలో కాంస్యం గెలిచిన లవ్లీనా బుధవారం తొలి రౌండ్‌లో సున్నీవా (నార్వే)తో తలపడనుంది. మరోవైపు శనివారం మహిళల 54 కేజీల విభాగంలో ప్రీతి పవార్ మాత్రమే పోటీ పడనుంది.

**తొలి రోజే నాలుగు విభాగాల్లో..'**
12 ఏళ్లుగా భారత్‌కు షూటింగ్‌లో పతకం దక్కడం లేదు. మొత్తంగా నాలుగు మెడల్స్ అందించిన ఈ విభాగం గత రెండు పర్యాయాలు రిక్తహస్తాలతోనే వెనుదిరిగింది. కానీ ఈసారి ఏకంగా 21 మంది షూటర్లు గురి చేసి గన్ పేల్చేందుకు సిద్ధమయ్యారు. అయితే 10మీ. ఎయిర్ పిస్టల్, 25మీ. పిస్టల్ ఈవెంట్లలో బరిలోకి దిగబోతున్న మను బాకర్‌తో పాటుగా 50మీ. రైఫిల్ 3 పొజిషన్‌లో అదరగొడుతున్న సిఫ్ట్ కౌర్ శర్మపై పతక ఆశలున్నాయి. అలాగే 25మీ. ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో పోటీ పడుతున్న హైదరాబాదీ ఇషా సింగ్‌పైనా అంచనాలు నెలకొన్నాయి. మరోవైపు భారత్ తొలి రోజు నాలుగు విభాగాల్లో పోటీ పడనుంది. ఇందులో రెండు మెడల్స్ ఈవెంట్లున్నాయి.

# కొత్త.. కొత్తగా

**నూతన కెప్టెన్, కోచ్‌తో టీమిండియా**
**శ్రీలంకతో తొలి టీ20 నేడు**
**రా. 7 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..**

పల్లెకెలె: టీ20 వరల్డ్ చాంపియన్ టీమిండియా మెగా టోర్నీ తర్వాత పూర్తిస్థాయి జట్టుతో సై అంటోంది. శ్రీలంకతో పరిమిత ఓవర్ల సిరీసలో భాగంగా తొలుత మూడు టీ20లలో తలపడనుంది. మొదటి టీ20 శనివారం ఇక్కడ జరగనుంది. కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్, కోచ్‌గా గంభీర్ కొత్తగా నియమితులయ్యారు. అలాగే జట్టులోనూ కొత్త ముఖాలు కనిపిస్తున్నాయి. దాంతో..కెప్టెన్, కోచ్‌తోపాటు జట్టులోని యువ క్రికెటర్లకు ఈ టూర్ పరీక్ష కానుంది. అనుభజ్ఞుడైన గంభీర్ కోచ్‌గా జట్టు పయనంపై ఆసక్తి రేకెత్తిస్తోంది.మొత్తంగా కొత్తకోచ్, సారథి ఆధ్వర్యంలో ఆటగాళ్ల ప్రదర్శన ఎలా ఉంటుందో చూడాలి. గతంలో సౌతాఫ్రికా, ఆస్ట్రేలియాతో టీ20 సిరీసలలో తాత్కాలిక కెప్టెన్‌గా వ్యవహరించిన సూర్యకు ఆ అనుభవం.. పూర్తిస్థాయి కెప్టెన్ బాధ్యతల్లో ప్లస్ కానుంది.

**రోహిత్, విరాట్, జడేజా లేకుండా..:** గతనెల ముగిసిన టీ20 ప్రపంచ కప్ అనంతరం స్టార్లు రోహిత్, విరాట్, జడేజా పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలికారు. దాంతో ఎన్నో ఏళ్ల అనంతరం ఈ త్రయం లేకుండా భారత్ బరిలో దిగుతోంది. ఇది టీమిండియాకు సంధి దశ. గిల్‌తోపాటు యువ బ్యాటర్లు జైస్వాల్, రింకూ, పరాగ్‌లు జట్టులో తమ స్థానాలను సుస్థిరం చేసుకొనేందుకు.. జడేజా స్థానంలో ఆల్‌రౌండర్‌గా తన ముద్ర వేసేందుకు అక్షర్ పటేల్‌కూ ఇది చక్కటి చాన్స్. ఆల్‌రౌండర్లు హార్దిక్, దూబే, వాషింగ్టన్‌లతో జట్టు పటిష్టంగా ఉంది. సీనియర్ బుమ్రా గైర్హాజరీలో యువపేసర్లు అర్ష్‌దీప్, సిరాజ్‌లకు ఈ సిరీస్ అద్భుత అవకాశం.

**లంకకు ఎదురుదెబ్బ:**
సిరీస్ ఆరంభంలోనే ఆతిథ్య జట్టుకు ఎదురు దెబ్బలు తగిలాయి. అనుభవజ్ఞులైన పేసర్లు చమీర అనారోగ్యంతో, తుషార గాయంతో సిరీస్‌కు దూరమయ్యారు. వారి స్థానాల్లో అసిత ఫెర్నాండో, దిల్షాన్ మధుశంక జట్టులోకి వచ్చారు. ఇది చాలదన్నట్టు..జట్టును ఫ్లూ జ్వరం పట్టిపీడిస్తున్నదట. దాంతో ఆల్‌రౌండర్ రమేష్ మెండిసను రిజర్వ్ ఆటగాడిగా పిలిపించారు. టీ20 వరల్డ్ కప్‌లో వైఫల్యంతో లంక జట్టులో మార్పులు జరిగాయి.



తాత్కాలిక కోచ్‌గా జయసూర్యను, అసలంకను కెప్టెన్‌గా ఎంపిక చేశారు. భారత్ మాదిరే కొత్త సారథి, కోచ్‌తో దిగుతున్న లంక జట్టు స్వదేశంలో జరిగే సిరీసలో పోటీ ఇస్తుందా అన్నది చూడాలి.

**జట్లు (అంచనా)**
భారత్: సూర్యకుమార్ (కెప్టె న్), గిల్, జైస్వాల్, పంత్ (కీపర్), హార్దిక్, దూబే, సుందర్, అక్షర్, అర్ష్‌దీప్, బిష్ణోయ్/ఖలీల్, సిరాజ్.
శ్రీలంక: అసలంక (కెప్టెన్), నిస్సాంక, మెండిస్ (కీపర్), పెరీరా, అవిష్క ఫెర్నాండో, షనక, హసరంగ, మహీష్ తీక్షణ, బినురా ఫెర్నాండో/అసిత ఫెర్నాండో, మధుశంక, పథిరన.

**పిచ్/వాతావరణం**
లంక ప్రీమియర్ లీగ్ సందర్భంగా పల్లెకెలె స్టేడియంలో జరిగిన ఐదు మ్యాచ్‌ల్లో మొదటి ఇన్నింగ్స్‌లో సగటున 185 పరుగులు నమోదయ్యాయి. ఈ మ్యాచ్‌ల్లో స్పిన్నర్లు మెరుగైన ప్రదర్శన చేశారు. మధ్యాహ్నం వర్షం కురిసే చాన్సుంది. మ్యాచ్ రాత్రి జరగనుండడంతో వరుణుడి నుంచి ఆటంకం లేకపోవచ్చు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
Roaming News

## బులుగు ఫ్రాకులో ప్రగ్య మంటలు



అందం ఉంది .. ప్రతిభ ఉంది .. కొన్ని పెద్ద అవకాశాలు వచ్చాయి... కానీ ఎక్కడో తేడా కొట్టింది. కారణం ఏదైనా కానీ ప్రగ్య జైశ్వాల్ తాను ఆశించిన స్టార్ డమ్ ని దక్కించుకోలేకపోయింది. ఇండస్ట్రీలో నిలదొక్కుకోవడం కోసం ఇంకా ఇంకా వేచి చూడాల్సిన పరిస్థితి. ఇటు సౌత్.. అటు నార్త్ రెండు చోట్లా ఇదే పరిస్థితి. పెద్ద స్టార్లు అవకాశాలు కల్పించినా కానీ తనకు విజయాలు కరువవ్వడం కెరీర్ పై తీవ్ర ప్రభావం చూపుతోంది. అయినా ప్రగ్యా మాత్రం నిరాశ చెందక తనవంతు ప్రయత్నాలను ఆపడం లేదు. ఇప్పటికీ తెలుగులో ప్రముఖ దర్శకనిర్మాతలకు ఈ భామ ఫీలర్స్ పంపుతూనే ఉంది. పలువురు అగ్ర హీరోల సరసన అవకాశం వచ్చినట్టే వచ్చి మిస్సయిందని ఇటీవల కథనాలొచ్చాయి. అయినా ఇవేవీ తనని ప్రభావితం చేయడం లేదు. ఎప్పటిలానే వరుస ఫోటోషూట్లను షేర్ చేస్తూ ప్రగ్య తన అభిమానులకు టచ్ లో ఉంది. తాజాగా ప్రగ్య షేర్ చేసిన ఓ హాట్ ఫోటోషూట్ ఇంటర్నెట్ ని షేక్ చేసింది.

అందమైన నీలిరంగు మినీ దుస్తులలో ప్రగ్య ఎంతో ఉల్లాసంగా ఉత్సాహంగా కనిపిస్తోంది. స్లీవ్ లెస్ డిజైనర్ ఫ్రాకులో ప్రగ్య అందచందాలను వర్ణించడానికి గమ్మత్తయిన పదాల్ని వెతుక్కోవాలి. ప్రగ్య కొత్త లుక్ ఇప్పుడు అంతర్జాలంలో వైరల్ గా దూసుకెళుతోంది. ప్రగ్యా స్టైలింగ్ గురించి యువతరం ప్రత్యేకంగా తరచి చూస్తోంది. మునుపటి కంటే బోల్డ్ ఫ్యాషన్ ఎంపికతో అందరి దృష్టిని ఆకర్షించింది. చివరిగా ఇలాంటి సిన్సియర్ ప్రయత్నాలు ఫలించి ఏదైనా కొత్త సినిమాని ప్రకటిస్తుందేమో చూడాలి.



## తమన్నా మళ్లీ అవే వైబ్స్.. డ్యాన్స్ ప్రాక్టీస్‌లోను

జైలర్ సినిమాలో తమన్నా చేసిన నువ్ కావాలయ్యా సాంగ్ ఎంత పాపులర్ అయ్యిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. మళ్లీ ఆ రేంజులో పాట కోసం అభిమానులు ఆసక్తిగా వేచి చూస్తుండగా ... బాలీవుడ్ మూవీ స్త్రీ 2 కోసం కూడా తమన్నా అలాంటి ఒక పాటలో నర్తించింది. ఇటీవలే ఈ పాటను విడుదల చేసింది టీమ్. ఇందులో తమన్నా డ్యాన్స్ మూవ్స్ కి యూత్ ఫిదా అయిపోయారు. మరోసారి కావాలా మూవ్స్ తో అదరగొట్టిందంటూ ఒకటే ప్రశంసలు కురిపించారు. తాజాగా తమన్నా ఈ పాట కోసం డాన్స్ ప్రాక్టీస్ చేస్తున్న వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఈ వీడియో ఇప్పుడు వైరల్ గా మారింది. తమన్నా హార్డ్ వర్క్ డెడికేషన్ తో పాటు తనలోని వాడి వేడి గురించి వెబ్ లో ముచ్చట కొనసాగుతోంది. సౌత్ లో అరుదైన డ్యాన్సింగ్ క్వీన్ గా తమన్నాకు చక్కని గుర్తింపు ఉంది. దానికి తగ్గట్టుగా కొరియోగ్రాఫర్లు ఈ భామ నుంచి మంచి ఔట్ పుట్ ని రాబడుతున్నారనడంలో సందేహం లేదు. ఓవైపు కథానాయికగా నటిస్తూనే, స్పెషల్ నంబర్లతో తమన్నా బాగానే ఆర్జిస్తోంది. ప్రస్తుతం తమన్నా సెలక్టివ్ గా మాత్రమే నటిస్తోంది. తెలుగులో సినిమాలు పూర్తిగా తగ్గించింది. బాలీవుడ్ పైనే ఎక్కువ దృష్టి పెడుతోంది. నటుడు విజయ్ వర్మతో రిలేషన్ నేపథ్యంలో హిందీ చిత్రసీమకు తమ్మూ కట్టుబడి ఉందని ప్రచారం సాగుతోంది.

## తెలుగువారు కళకు ప్రాధాన్యం ఇస్తారు

దేవర విశేషాలను వివరించిన జాన్వీకపూర్

బాలీవుడ్ బ్యూటీ జాన్వీకపూర్ టాలీవుడ్ అగ్ర హీరో ఎన్టీఆర్‌పై ప్రశంసల వర్షం కురిపిస్తోంది. గత నాలుగు రోజులుగా ఆమె తాజా చిత్రం 'ఉలఝ్' సినిమా ప్రమోషన్లో బిజీగా ఉంది. ప్రతి ఇంటర్వ్యూలోనూ తారక్ గురించి ప్రస్తావిస్తోంది. అతని యాక్టింగ్, డాన్స్ గురించి పదేపదే చెబుతోంది. వీరిద్దరూ కలిసి 'దేవర' చిత్రంలో నటిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ ఆఖరి దశలో ఉంది. ఈ మేరకు ఇచ్చిన ఇంటర్వ్యూలో దేవర సినిమా షూటింగ్ అనుభవాలను షేర్ చేశారు జాన్వీ కపూర్. 'తెలుగువారి పనితీరు నాకు ఎంతో ఇష్టం. వారు కళను, సినిమాను గౌరవిస్తారు వారి వ్యవహారం హుందాగా ఉంటుంది. కథపై నమ్మకంతో పని చేస్తారు. ప్రస్తుతం నేను 'దేవర'లో నటిస్తున్నా. జూనియర్ ఎన్టీఆర్ ఎనర్జిటిక్ హీరో. ఆయన రాగానే సెట్‌కే కళ వస్తుంది. అందరూ ఉత్సాహంగా ఉంటారు. ఇటీవల జరిగిన షెడ్యూల్‌లో మా ఇద్దరిపై ఓ పాటను చిత్రీకరించారు. తారక్ డాన్స్ వేగాన్ని చూసి ఆశ్చర్యపోయాను. ఎన్టీఆర్ ఒక్క సెకనులో దేన్నైనా నేర్చుకోగలరు. అదే విషయాన్ని నేర్చుకోవడానికి నాకు 10 రోజులు పడుతుంది. ఆయనతో తర్వాత పాట షూటింగ్ కోసం ఇప్పటి నుంచే ప్రాక్టీస్ చేస్తున్నా. దర్శకుడు కొరటాల శివ ఎప్పుడూ ప్రశాంతంగా ఉంటారు. ఏ విషయమైనా సున్నితంగా చెబుతారు. ఆయనతో కలిసి పనిచేయడం ఈజీగా ఉంది' అని అన్నారు. వ్యక్తిగత విషయాల గురించి చెబుతూ 'ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలని నా తల్లిదండ్రులు నేర్పారు. వాళ్లతో పాటు నా ఫ్యాన్స్ నన్ను చూసి గర్వించేలా ఉంటాను. ప్రస్తుతం సంతోషకరమైన జీవితాన్ని గడుపుతున్నాను. రిలేషన్ గురించి వెల్లడించే సమయం లేదు. ఇటీవల ఆరోగ్యపరంగా కొంచెం ఇబ్బంది పడ్డాను. ఇప్పుడే కోలుకుంటున్నా' అని జాన్వీ చెప్పారు.



Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986